Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 177 మేడ్చల్ మల్కాజ్‌గిరి 19 జూలై 2024 శుక్రవారం పేజీలు : 4

### రత్నభాండాగారంలో పురాతన విగ్రహాలు

భువనేశ్వర్ : పూరీ జగన్నాథ ఆలయం లోని రత్నభాండాగారం లోపలి గదిలో విలువైన లోహాలతో రూపొందించిన పురాతన విగ్రహాలను అధికారుల బృందం గుర్తించింది. వీటి గురించిన వివరాలు పాత జాబితాల్లో ఎక్కడా లేకపోవడం గమనార్హం. 'పురాతనమైన చిన్న విగ్రహాలు... బహుశా 5 నుంచి 7 వరకూ ఉండొచ్చు. గత నాలుగు దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోక పోవడంతో దాదాపు నల్లగా మారిపోయాయ్యు. మేం ఎవ్వరమూ వాటిని తాకలేదు. వెంటనే ఒక దీపం వెలిగించి వాటికి పూజలు చేశాం. వాటిని కూడా తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తాం' అని రత్నభాండాగారంలోని ఖజానాను పర్యవేక్షిం చడానికి ఒడిశా ప్రభుత్వం నియమించిన 11 మంది సభ్యుల కమిటీ చైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్ చెప్పారు.




# ఇచ్చిన మాట ప్రకారం...

# రుణమాఫీ నిధులు విడుదల

హైదరాబాద్: తెలంగాణ రైతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారమే రైతు రుణమాఫీని విడుదల చేశారు. ఈరోజు( గురువారం) తెలంగాణ సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. లక్ష రూపాయల వరకు రుణాలను మాఫీ చేసినట్లు ప్రకటించారు. సుమారు పదకొండున్నర లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7వేల కోట్లు జమ చేసినట్లు వివరించారు. నిధులు విడుదల కావడంతో రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులు రైతువేదికల వద్ద సంబురాలు చేసుకుంటున్నారు. ఈ నెలాఖరుకు లక్షన్నర రూపాయలు, ఆగస్టు 15 నాటికి 2 లక్షల వరకు రుణాబకాయిలను రైతుల తరఫున ప్రభుత్వం బ్యాంకులకు చెల్లించేలా ప్రణాళిక చేసింది. రైతు రుణమాఫీకి రూ. 31 వేల కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. రుణమాఫీ నిధులను వేరే అప్పులకు జమ చేయవద్దని ఇప్పటికే బ్యాంకర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకంపై రుణం ఉన్న ప్రతి రైతు కుటుంబానికీ రూ.2 లక్షల రుణమాఫీ పథకం వర్తిస్తుందని చెప్పారు. కేవలం కుటుంబాన్ని నిర్ధారించేందుకు మాత్రమే రేషన్ కార్డును పరిగణనలోకి తీసుకుంటామని, రేషన్ కార్డులు లేనంత మాత్రాన ఆ రైతులకు అన్యాయం జరగనివ్వబోమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. కాగా.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఫేస్ -1 కింద 18న రైతులకు లక్ష వరకు రుణమాఫీ చేస్తుండటంతో ఘనంగా సంబరాలు చేసుకుంటున్నారు. బ్యాంకుల్లో రుణమాఫీ నగదు జమ చేయడంతో మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు లబ్ధిదారులతో కలిసి సంబరాలు చేసుకుంటున్నారు. రైతు కుటుంబాన్ని గుర్తించడానికి ఆహార భద్రతాకార్డు వివరాలు ప్రామాణికంగా రుణమాఫీ ఉంటుందని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. రాష్ట్రంలో ఉన్న షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకారం కేంద్ర బ్యాంకుల నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలకు ఈ పథకం వర్తించనుంది. పథకం అమలు కోసం ప్రతి బ్యాంకులో ఒక నోడల్ అధికారిని నియమించగా, ఆ అధికారి నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్‌కు సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. డిసెంబరు 12, 2023 నాటికి రైతుకు ఉన్న రుణం, లేక రెండు లక్షల వరకు ఏది తక్కువైతే దాన్ని పొందేందుకు రైతులు అర్హులు. అలాగే రెండు లక్షల మించిన రుణం ఉన్న రైతులు ఆపైన ఉన్న రుణాన్ని మొదట చెల్లించాల్సి ఉంటుందనే నిబంధన ఉండగా, ఆ తరువాతనే రుణమాఫీ పొందే వెసులుబాటు కల్పించింది.





## రాజీనామా సవాల్‌కి కట్టుబడి ఉన్నా.. కానీ అన్నీ హామీలు అమలు చేయాలి

హైదరాబాద్: రుణమాఫీపై తాను చెప్పినట్లుగానే రాజీనామా చేస్తా కానీ రేవంత్ ప్రభుత్వం అన్ని హామీలను అమలు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. ఆగస్ట్ 15లోపు రైతు రుణమాఫీ హామీని అమలు చేస్తే హరీష్ రావు రాజీనామా చేస్తానని ఛాలెంజ్ విసిరారని, ఆ సంగతేంటో ముందు చెప్పాలని సోషల్ మీడియాలో కాంగ్రెస్ హడావిడి చేస్తోంది. రైతు రుణమాఫీని ముందుగానే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని, తమ చిత్తశుద్ధి నిరూపించుకుంటోందని, హరీష్ రావు రాజీనామా చేసి తన మాట నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ఈ ప్రశ్నలకు హరీష్ తాజాగా సమాధానమిచ్చారు. తానిప్పటికీ రాజీనామా ఛాలెంజ్‌కి కట్టుబడి ఉన్నానని, అయితే తాను చెప్పినట్టుగా కాంగ్రెస్ అన్ని హామీలు అమలు చేయాలని అన్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలతోపాటు 13 హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు హరీష్ రావు. రైతు రుణమాఫీ సహా, అధికారంలోకి వస్తే 100 రోజుల్లోగా అమలు చేస్తామన్న హామీలన్నిటినీ నెరవేరిస్తే తాను తప్పకుండా రాజీనామా చేస్తానన్నారు హరీష్ రావు. ఆగస్ట్-15లోపు రుణమాఫీ పూర్తి చేయాలని, దానితోపాటు ఆరు గ్యారెంటీలు, 13 హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తనకు పదవి ముఖ్యం కాదని, తన పదవి పోయినా ప్రజలకు న్యాయం జరిగితే అదే సంతోషమని అన్నారు హరీష్ రావు. తన ఛాలెంజ్ స్వీకరించి అయినా కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేస్తే చాలన్నారు. కేవలం రైతు రుణమాఫీపైనే తాను మాట్లాడలేదని, హామీలన్నీ అమలు చేస్తేనే రాజీనామా అని చెప్పానని గుర్తు చేశారు.



## రైతుబంధు నిధులనే దారి మళ్లించారు: కేటీఆర్

హైదరాబాద్: రుణమాఫీ పేరిట రేవంత్ సర్కార్ మరోసారి తెలంగాణ రైతులను మోసం చేస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు ఎక్స్(ట్విటర్) వేదికగా పోస్టు చేశారు. రైతుబంధు కింద జూన్ నెలలో ఇవ్వాల్సిన నిధుల నుంచే రూ.7000 కోట్లు రుణమాఫీకి దారి మళ్లించారని ఆరోపించారు. రైతుబంధు డబ్బు నుంచి కొంత మొత్తం విదిల్చి రుణమాఫీ చేస్తున్నట్లు చెబుతున్నారన్నారు. 40 లక్షల మందికి పైగా రైతులు రూ.లక్ష వరకు రుణాలు తీసుకుంటే కేవలం 11 లక్షల మందినే ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. 2014, 2018లో కేసీఆర్ సర్కార్ రుణమాఫీతో పోలిస్తే పావు వంతు రైతులకే అర్హత కల్పించారన్నారు.

2014లోనే కేసీఆర్ సర్కార్ లక్షలోపు రుణాలను మాఫీ చేయడానికి రూ.16,144 కోట్లు వెచ్చించిందని.. సుమారు 35 లక్షల రైతులకు లబ్ధి చేకూర్చిందని తెలిపారు. 2018లో అదే లక్షలోపు రుణమాఫీకి రూ.19,198 కోట్లు అంచనా కాగా మొత్తం లబ్ధిదారుల సంఖ్య సుమారు 37 లక్షలుగా పేర్కొన్నారు.

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినట్లు రూ.2 లక్షల వరకు ఉన్న పంటరుణాలు అన్నీ వెంటనే మాఫీ చేయాలన్నారు. అర్హులైన అందరికీ రైతుబంధు విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ఆ నిధులు రుణమాఫీకే.. ఇతర అప్పులకు జమచేయొద్దు: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులను రుణమాఫీకే వినియోగించాలని.. ఇతర అప్పులకు ఎట్టి పరిస్థితుల్లోనూ జమ చేయొద్దని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ఈ విషయంలో రైతులను ఇబ్బంది పెట్టొద్దన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రజా భవన్‌లో బ్యాంకర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రైతు రుణమాఫీ దేశంలోనే చరిత్రాత్మక నిర్ణయమని చెప్పారు. రూ.2లక్షల రుణమాఫీ పథకం ద్వారా ఒకేసారి రూ.31వేల కోట్లు ఏ రాష్ట్రంలోనూ మాఫీ చేయలేదన్నారు. "ఆగస్టు నెల దాటకముందే రుణమాఫీ కింద రూ.31వేల కోట్ల నిధులను విడుదల చేస్తాం. గంటలకు 11 లక్షలకు పైగా రైతులకు రూ.6వేల కోట్లు విడుదల చేస్తున్నాం. ఈ నెలలలోనే రెండో దఫా రూ.లక్షన్నర వరకు బకాయి ఉన్న రైతులకు, ఆ తర్వాత రూ.2లక్షల వరకు రుణాలకు నిధులు విడుదల చేస్తాం. రూ.2 లక్షలకు పైబడి రుణం ఉన్న రైతులతో బ్యాంకర్లు మాట్లాడి మిగిలిన మొత్తాన్ని రికవరీ చేసుకోవాలి. ప్రభుత్వం మంజూరు చేసే రూ.2లక్షలు కలిపి మొత్తంగా ఏ రైతూ రుణ బకాయి ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

**ఒకేసారి ఇలా రికవరీ కావడం చరిత్ర..** అధికారంలోకి వచ్చేముందు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేతగా నేను రైతు రుణమాఫీ గ్యారంటీ కార్డుపై సంతకం చేసి ప్రచారంలోకి వెళ్లాం. ఇచ్చిన మాటకు కట్టుబడి తూచా తప్పకుండా రైతు రుణమాఫీని అమలు చేసి చూపిస్తున్నాం. రూ.31వేల కోట్ల నిధులను 40లక్షల బ్యాంకు ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుంది. దేశ బ్యాంకింగ్ రంగంలో ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి రికవరీ కావడం ఓ చరిత్ర. కార్పొరేట్ బ్యాంకింగ్‌లోనూ ఇంతలా ఒకేసారి జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం.. బ్యాంకింగ్ వ్యవస్థకు పెద్ద ప్రోత్సాహం. రైతుల తరహాలోనే బ్యాంకర్లు కూడా పండుగ చేసుకోవాలి. వ్యవసాయరంగ అభివృద్ధి కోసం భవిష్యత్తులో ఎన్నో కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాబోతోంది. రైతు రుణమాఫీ కింద వచ్చిన నిధులను బ్యాంకర్లు జమ చేసుకొని.. భవిష్యత్తు అవసరాల కోసం రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలి. రుణాలు ఇచ్చే విషయంలో ఎక్కడా అశ్రద్ధ చూపొద్దు. లీడ్ బ్యాంకు పెద్దన్న పాత్ర పోషించాలి" అని భట్టి విక్రమార్క సూచించారు.



# అసెంబ్లీ నాటికి కాంగ్రెస్‌లోకి...

# మరో 8 మంది!

## కారును వీడేందుకు సిద్ధపడుతున్న మరికొంతమంది బిఆర్ఎస్ ఎంఎల్ఏలు

### చేరేందుకు అవకాశాలు ఉన్న వారితో కాంగ్రెస్ నేతల మంతనాలు

### పలుచోట్ల స్థానిక నేతల అభ్యంతరాలతో కొంత ఆలస్యం

### అసంతృప్తులకు భరోసా ఇస్తున్న నాయకత్వం

హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 24వ తేదీన ప్రారంభమయ్యే నాటికి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 8 మంది ఎమ్మెల్యేలు కారు దిగి, కాంగ్రెస్ కండువా కప్పుకునే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో అధికార పార్టీలోకి చేరికల పరంపర కొనసాగుతోంది.

తాజాగా పటాన్‌చెరు ఎమ్మెల్యే చేరికతో బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎంఎల్ఎల సంఖ్య పదికి చేరింది. ఏఐసిసి చేరికలకు అనుమతిచ్చిన నేపథ్యంలో పార్టీ రాష్ట్ర నాయకత్వం సైతం ఆచితూచి అడుగులేస్తోంది. నేపథ్యంలోనే కారు దిగేందుకు 8 మంది ఎమ్మెల్యేలు రెడీగా ఉండగా వారిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు టిపిసిసి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టుగా తెలిసింది. ఈ నేపథ్యంలోనే సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు, మేడ్చల్ మల్కాజిగిరి ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డిలు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మినహా మిగిలిన వారితో కాంగ్రెస్ నాయకులు మంతనాలు జరుపుతున్నట్లుగా తెలుస్తోంది.

**స్థానిక కాంగ్రెస్ నేతల అభ్యంతరాలు :** కాంగ్రెస్‌లో చేరడానికి నగరానికి చెందిన 8 మంది ఎమ్మెల్యేలు ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు పిసిసి వర్గాలు చెబుతున్నాయి. ఆ తర్వాత మిగిలిన వారు సైతం పార్టీలో చేరే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

అయితే ఎమ్మెల్యేల చేరిక పట్ల పలుచోట్ల స్థానిక కాంగ్రెస్ నేతల నుం చి అభ్యంతరాలు వ్యక్తమవుతుండడంతో కొంత ఆలస్యం జరుగుతుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. అదేవిధంగా స్థానిక కాంగ్రెస్ నాయకులకు అన్యాయం జరగకుండా చూస్తామని టిపిసిసి వారికి హామీ ఇస్తున్నట్టుగా తెలిసింది.

ఇప్పటికే బిఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరగా, మరో 16 మం ది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వచ్చినట్టైతే బిఆర్ఎస్ఎల్పీని విలీనం చేసే అవకాశం ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# సంపాదకీయం

## మోడీ మీద ఉక్రెయిన్ భారం మోపిన అమెరికా

ప్రధానిగా మూడోసారి గెలిచిన తరువాత నరేంద్ర మోడీ రష్యా పర్యటనకు వెళ్లారు. అది కూడా దాదాపుగా అయిదేళ్ల తరువాత. ఇక ఉక్రెయిన్ తో రష్యా యుద్ధం ప్రారంభించిన తరువాత మోడీ రష్యా టూర్ చేయడం ఇదే తొలిసారి. ఇలా ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ పర్యటన సహజంగానే అమెరికాకు కంటగింపుగా మారింది. ఏక ధృవ ప్రపంచాన్ని కోరుకుంటున్న అమెరికా ఉక్రెయిన్ వెనక ఉందని అంతా అనుమానిస్తున్న సంగతి తెలిసిందే. రష్యాని దెబ్బ తీయడానికి ప్రచ్ఛన్న యుద్ధానికి తలుపు తెరిచినట్లుగా ప్రచారంలో ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో రష్యా మీద ఒత్తిడి అమెరికా వివిధ రకాలుగా చేస్తూ పోయింది. ఈ పరిణామాల మధ్య భారత తటస్తంగా ఉంటూ వచ్చింది. ఇపుడు ఏకంగా ప్రధాని రష్యా టూర్ పెట్టుకుని దశాబ్దాల భారత్ రష్యా మిత్ర బంధాన్ని మరోసారి చాటారు. మోడీ రష్యా టూర్ మీద అమెరికా సన్నాయి నొక్కులు నొక్కుతూ వచ్చింది. ఇపుడు చూస్తే ఉక్రెయిన్ తో వివాదానికి రష్యా ముగింపు పలికేలా భారత్ ప్రయత్నించి ఒప్పించాలని అమెరికా సూచిస్తోంది. ఉక్రెయిన్‌తో వివాదానికి సంబంధించి తన చట్ట విరుద్ధమైన యుద్ధాన్ని ముగించాలని శాశ్వత శాంతిని కనుగొనాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను భారత్ ఈ విధంగా కోరాలని అమెరికా అంటోంది. ఈ విషయంలో రష్యాతో ఉన్న దీర్ఘకాల సంబంధాన్ని ఉపయోగించుకోవాలని అమెరికా భారతదేశాన్ని కోరింది. అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ దీని మీద మాట్లాడుతూ భారతదేశం రష్యాతో సుదీర్ఘ సంబంధాన్ని కలిగి ఉందని గుర్తు చేశారు. అందుకే రష్యాతో ఆ సంబంధాన్ని ఉపయోగించుకుని ఉక్రెయిన్ సమస్య తీర్చాలని భారతదేశాన్ని కోరుతున్నామని అన్నారు. అదే సమయంలో ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రత సార్వభౌమత్వాన్ని గౌరవించమని ఐక్య రాజ్యసమితి చార్టర్‌ను గౌరవించమని భారతదేశం వ్లాదిమిర్ పుతిన్‌కు చెప్పాలని ఆయన అన్నారు. ఒక విధంగా చూస్తే ఇది సూచనగా ఉన్నా భారత్ ని ఇరికిస్తున్నట్లుగానే ఉంది. రష్యా ఉక్రెయిన్ ల విషయంలో భారత్ ఎపుడూ ఒకే మాట చెబుతూ వస్తోంది. చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కోరుతోంది. రష్యా తనదైన రక్షణ పరమైన అనుమానాలు భయాందోళనలు వ్యక్తం చేస్తోంది. ఉక్రెయిన్ వెనక ఉన్న శక్తుల గురించే రష్యా కలవరపడుతోంది.

పరిస్థితి ఇలా ఉంటే ఏకపక్షంగా రష్యాను తగ్గమని అడిగే హక్కు ఎవరికైనా ఎలా ఉంటుంది. ముందు ఉక్రెయిన్ కి నాటో దేశాల సాయం నిలుపుదల చేసి చర్చలకు వెళ్లమని పెద్దన్న తానే కోరవచ్చు కదా అన్న మాట కూడా ఉంది. ఏది ఏమైనా భారత్ రష్యా బంధాన్ని దెబ్బ తీయడానికే ఈ ఫిట్టింగ్ ని పెద్దన్న పాత్రలో అగ్ర దేశం పెట్టినట్లుగా ఉందని అంటున్నారు.

# రైతు రుణమాఫీ తో రైతు కుటుంబాల్లో ఆనందాన్ని, ధైర్యాన్ని కలిగిస్తుంది : కలెక్టర్ గౌతం





శామీర్‌పేట, (గరుడ వార్త): రైతు రుణమాఫీ తో రైతు కుటుంబాల్లో ఆనందం, నమ్మకం నెలకొందని మేడ్చెల్ జిల్లా కలెక్టర్ గౌతం అభిప్రాయపడ్డారు. గురువారం శామీర్‌పేట మండలం అలియాబాదు గ్రామ పరిధిలోని మార్కెట్ కమిటీ రైతు వేదికలో రైతు రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ లో జరిగిన రైతుల సంబురాల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ... ఆలియాబాదు రైతులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. రైతు రుణమాఫీ అనేది రైతులకు ఒక పండగ లాంటిదని, రైతులకు రుణ భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం గొప్పనిర్ణయం తీసుకుందని తెలిపారు. మొదటి విడతలో లక్ష రూపాయలు రుణమాఫీ రైతు ఖాతాలో జమ అవు తాయని చెప్పారు. లక్ష లోపు రుణం ఉన్న రైతులకు జీరో అవుతుందన్నారు. లక్ష కంటే ఎక్కువ రుణాలు ఉన్న రైతులు, రుణమాఫీ కాలేదని అధైర్య పడవద్దని, రెండో విడత, మూడో విడతలో రుణమాఫీ చేయడం జరుగుతుందని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున వ్యవసాయం చేసే రైతులు రుణాల కోసం రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. రైతులకు ఏమన్నా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి జిల్లా వ్యవసాయ, మండల వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారన్నారని, వారిని సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట మండల ప్రత్యేకాధికారి సైదులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మేరీ రేఖ, శామీర్ పేట తాసిల్దార్ యాదగిరిరెడ్డి, ఎంపీడీవో మమతాబాయి, వ్యవసాయ అధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

**మూడు చింతలపల్లి మండలంలో....** అలాగే మూడు చింతలపల్లి రైతు వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణమాఫీ నిధుల విడుదల

**రైతు రుణమాఫీ తో రైతు కుటుంబాల్లో సంతోషం : కలెక్టర్ గౌతం**

– శామీర్‌పేట, జులై 18 (ప్రజా మలుపు): రైతు రుణమాఫీ తో రైతు కుటుంబాల్లో సంతోషం నెలకొందని మేడ్చెల్ జిల్లా కలెక్టర్ గౌతం చెప్పారు. గురువారం శామీర్‌పేట మండలం అలియాబాదు గ్రామ పరిధిలోని మార్కెట్ కమిటీలో గల రైతు వేదికలో రైతు రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ లో జరిగిన రైతుల సంబురాలలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆలియాబాదు రైతులందరికీ శుభాకాంక్షలు చెప్పారు. రైతు రుణమాఫీ అనేది రైతులకు ఒక పండగ లాంటిదని, రైతులకు రుణ భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం గొప్పనిర్ణయం తీసుకుందని తెలిపారు. మొదటి విడతలో లక్ష రూపాయలు రుణమాఫీ రైతు ఖాతాలో జమ అవు తాయని చెప్పారు. లక్ష లోపు రుణం ఉన్న రైతులకు జీరో అవుతుందన్నారు. లక్ష కంటే ఎక్కువ రుణాలు ఉన్న రైతులు, రుణమాఫీ కాలేదని అధైర్య పడవద్దని, రెండో విడత, మూడో విడతలో రుణమాఫీ చేయడం జరుగుతుందని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున వ్యవసాయం చేసే రైతులు రుణాల కోసం రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. రైతులకు ఏమన్నా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి జిల్లా వ్యవసాయ, మండల వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారన్నారని, వారిని సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట మండల ప్రత్యేకాధికారి సైదులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మేరీ రేఖ, శామీర్ పేట తాసిల్దార్ యాదగిరిరెడ్డి, ఎంపీడీవో మమతాబాయి, వ్యవసాయ అధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

**మూడు చింతలపల్లి మండలంలో....** అలాగే మూడు చింతలపల్లి రైతు వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణమాఫీ నిధుల విడుదల వీడియో కాన్ఫరెన్స్ను అధికారులు రైతులు పాల్గొని వీక్షించారు. రైతు సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ను అధికారులు రైతులు పాల్గొని వీక్షించారు. రైతు సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలి : జిల్లా కలెక్టర్ గౌతమ్

### అలియాబాద్ గ్రామ రైతువేదిక వద్ద మొక్కలను నాటిన కలెక్టర్ గౌతమ్

### పాల్గొన్న అధికారులు గ్రామస్తులు అలియాబాద్ గ్రామం మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డి తదితరులు



శామీర్ పేట, (గరుడ వార్త) : ప్రతి ఒక్కరూ విధిగా ఖాళీ ప్రదేశాల్లో అత్యధికంగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత చేపట్టాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ పిలుపునిచ్చారు.

గురువారం శామీర్ పేట మండలం అలియాబాద్ రైతువేదిక ఆవరణలో జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని మేరి రేఖ, మండల ప్రత్యేక అధికారి, జిల్లా డిప్యూటీ కలెక్టర్ సైదులు వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలన్నారు. నేడు నాటిన మొక్కలే భావితరాలకు మనుగడగా నిలుస్తాయని గుర్తు చేశారు.

అత్యధికంగా మొక్కలు నాటి వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించాలని సూచించారు. ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంపీడీఓ మమతాబాయి, మండల వ్యవసాయ అధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాలు చేపడితే కఠిన చర్యలు...

శామీర్ పేట, (గరుడ వార్త) : ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే ఎంతటి వారికైనా కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ హెచ్చరించారు. గురువారం శామీర్ పేట మండలం తుంకుంట మున్సిపల్ పరిధిలోని ఎం ఎం రెడ్డి కాలనీలో పబ్లిక్ రోడ్డుపై నిర్మించిన డబ్బాను డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్సు టీమ్ బృందం పోలీసుల సహకారముతో కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని



చెప్పారు. రోడ్డు పక్కన అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు, డబ్బులు ఏర్పాటు చేయరాదని సూచించారు. ఎమ్ ఎమ్ రెడ్డి కాలనీలోని పబ్లిక్ రోడ్డులో నిర్మించిన డబ్బాను తొలగించాలని కాలనీవాసులకు పలుమార్లు నోటీసు జారీ చేశామని తెలిపారు. రెండు దపాలుగా సమయం ఇచ్చిన తమ నోటీసులకు స్పందించకుండా ఉండడంతో తొలగించాల్సి వచ్చిందని చెప్పారు. ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన సహించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతును రాజు చేయడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నక్కా ప్రభాకర్ గౌడ్



శామీర్‌పేట, (గరుడ వార్త ) రైతులను రాజులుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్కా ప్రభాకర్ గౌడ్ అన్నారు. రైతులకు ఏకకాలంలో లక్ష రుణ మాఫీ కార్యక్రమంలో గురువారం అలియబాద్ రైతు వేదికలో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ లో అధికారులు, రైతుల తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర రైతాంగానికి ఏకకాలంలో లక్ష రూపాయలు రుణమాఫీ చేయడంతో రాష్ట్ర రైతులతో పాటు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కనీవిని ఎరగని రీతిలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కొరకు పాటుపడుతుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఎ- బ్లాక్ అధ్యక్షులు వేణు గోపాల్ రెడ్డి, శామీ ర్‌పేట మండల అధ్యక్షులు వైఎస్ గౌడ్ , అలియాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ సీనియర్ నాయకులు కమటం కృష్ణారెడ్డి, తూంకుంట మున్సిపల్ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ఇంటింటా పూల పరిమళం..!

సూర్యాపేట : నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని 19 పురపాలికల్లో హరితహారం అమలుకు పుర అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే పట్టణ ప్రగతి కింద ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు పెంచారు. వర్షాలు కురవడమే తరువాయి అన్నట్లుగా సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. పట్టణాల్లో ఎక్కడెక్కడ మొక్కలు నాటాలో ఆయా ప్రదేశాలను గుర్తిస్తున్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలోని పురపాలికల్లో 20,73,200 మొక్కలు నాటాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ముందస్తుగా అంచనాల రూపకల్పన

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పురపాలికల పరిధిలో గుర్తించిన స్థలాల్లో, ఇళ్లల్లో పూలు, పండ్ల మొక్కలు నాటించేందుకు ముందుగానే అంచనాలు రూపొందించారు. ఇందుకు పట్టణ ప్రగతి నిధులు వెచ్చించి శాశ్వత పట్టణ నర్సరీలు నెలకొల్పారు. ఆయా నర్సరీలలో గతేడాది నవంబరు నెల నుంచే మొక్కల పెంపకానికి కావాల్సిన ఏర్పాట్లు చేశారు. ఇందుకు నాణ్యమైన మట్టి, విత్తనాలు తెప్పించి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి మొక్కల పెంపకం చేపట్టారు. విత్తనాలు మొలకెత్తి ఎదిగేందుకు సేంద్రియ ఎరువులు వినియోగించడంతోపాటు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు. నాటే మొక్కలివే.. నివాస ప్రాంతాలు, ఇళ్లల్లో ప్రజలతో మొక్కలు నాటించేందుకు ఇంటింటికీ పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందుకు పట్టణ నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేశారు. గులాబీ, మల్లె, మందార, గోరింటా, చామంతి, పారిజాతం, తులసి, జామ, ఉసిరి, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, అల్లనేరేడు, చింత, వేప, గుల్‌మోహర్, చైనాబాదం, వాటర్ యాపిల్, కానుగ, బాదం, మారేడు, ఎర్రచందనం, శ్రీగంధం, బాహినియా, కదంబం, సెల్టోఫాం, టేకొమా, టేకు, స్పాథోడియా, నెమలినార, నీలగిరి తదితర మొక్కలు పెంచారు. వర్షాలు కురిస్తే వీటిని పంపిణీ చేసేందుకు ఇప్పటికే నర్సరీల్లో సిద్ధంగా ఉంచారు.

# నిమిత్త 'మాత్ర'మేనా..?

సత్తుపల్లి : ఖమ్మంలోని శ్రీనివాసనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఇది. నిధుల లేమితో సతమతమవుతోంది. నగరంలో పేద వర్గాలకు ప్రాథమిక వైద్య సేవలందించే నాలుగు పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిస్థితి ఇలాగే ఉంది. ఆరోగ్య కేంద్రాల నిర్వహణ రోజురోజుకూ దిగజారుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సత్తుపల్లి మండలం గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రమిది. కంప్యూటర్లు మరమ్మతులకు గురయ్యాయి. నిధులు లేకపోవటంతో వాటిని అలాగే వదిలేశారు. ఆన్‌లైన్ సేవలకు అంతరాయం ఏర్పడుతుందని పలువురు చెబుతున్నారు.

మధిర మండలంలోని దెందుకూరు పీహెచ్‌సీ ఇది. ఔషధాల కొరతతో రోగులు సతమతమవుతున్నారు. రోజువారీగా కూలీ పనులు చేసే ప్రజలు ఇక్కడి వైద్యసేవలపై ఆధారపడుతుంటారు. అయితే సరిపడా మాత్రలు దొరక్కపోవటంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలను నిధుల కొరత వేధిస్తోంది. జాతీయ ఆరోగ్య పథకం కింద ఏటా ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ (హెచ్‌డీఎస్) పేరిట ఒక్కో ఆరోగ్య కేంద్రానికి రూ. 1.75 లక్షలు రావాలి. ప్రభుత్వాలు గతేడాది నుంచి పైసా విదల్చకపోవటంతో కేంద్రాల నిర్వహణ భారంగా మారింది. ఫలితంగా ఆసుపత్రుల్లో వైద్యసేవలు నామమాత్రంగా అందుతున్నాయి. ఈ ఏడాది నుంచి హెచ్‌డీఎస్ కమిటీలను 'జన్ ఆరోగ్య సమితి కమిటీలు'గా మార్చారు. ఆసుపత్రుల నిర్వహణ, కొత్త పరికరాల కొనుగోలు, ల్యాబ్, శానిటరీ, ఎలక్ట్రికల్, ఇతర అవసరాలకు నిధులు వెచ్చించటానికి ఈ కమిటీల ఆమోదం తప్పనిసరి. అసలు నిధులే లేనప్పుడు కమిటీలు మాత్రం



ఏంచేస్తాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి మాట్లాడుతూ నిధుల కొరత వాస్తవమేనన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన వెంటనే ఆరోగ్య కేంద్రాల ఖాతాలకు జమచేస్తామని చెప్పారు.

వైరా పీహెచ్‌సీ ఇది. ఆసుపత్రి మరుగుదొడ్ల నిర్వహణకు ప్రతినెలా రూ. 1,500 చొప్పున వైద్యులు సొంతంగా ఖర్చు చేస్తున్నారు. ఇటీవల మోటరు కాలిపోయింది. మరమ్మతులకు రూ. 3,500 ఖర్చయ్యింది. దీనిని సొంతంగా భరించారు. రోగి ఆసుపత్రిలో చేరితే కాన్యులా అమర్చేందుకు ఐవీ స్టాండ్లు కొనేందుకూ డబ్బులు లేవు. అక్కడక్కడ ఆసుపత్రి భవనం స్లాబ్ కురుస్తోంది. మరమ్మతులు చేయించేందుకు నిధులు లేవని వైద్యులు చెబుతున్నారు.

ఖమ్మం గ్రామీణం మండలం ఎంవీపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ).

ఇక్కడ వైద్యురాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఏఎన్ఎం, ఇద్దరు సహాయకులు, సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వైద్యసేవలు నామమాత్రంగా అందుతున్నాయి. వరంగల్ అడ్డరోడ్డు ప్రాంతంలో మరో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.


# కాటేసే కాలం.. జర భద్రం

వలిగొండ :జిల్లాలో వానలు కురుస్తున్నాయి. దీంతో పచ్చటి పొదలు, ఏపుగా పెరిగిన గడ్డి విష పురుగులకు ఆవాసంగా మారాయి. గడిచిన మూడు నెలల్లో యాదాద్రి జిల్లాలో 48 మంది పాముకాటుకు గురయ్యారు. గ్రామీణ, తండా ప్రాంతాల ప్రజలు ఎక్కువగా పాము కాటుకు గురవుతున్నారు.

కొన్ని ఘటనలు ఇలా..

వలిగొండ మండలం నాతాళ్లగూడెం గ్రామానికి చెందిన రైతు ఉద్దగిరి ఎల్లయ్య ఈనెల 8న పొలం వద్ద పాము కాటుకు గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు.

రెండేళ్ల కిందట వర్షాకాలంలో బీబీనగర్ మండలం మీదితండా గ్రామానికి చెందిన యువతి రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. అమ్మాయిని ఉరుకులు పరుగుల మీద ఘట్కేసర్ ఆసుపత్రికి తరలించే సరికి ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు.



తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పొలానికి వెళ్లేటప్పుడు రైతులు, కూలీలు తమ వెంట కర్రను తీసుకెళ్లి.. నేలపై శబ్దం చేస్తూ, అటూ ఇటూ తిప్పుతూ వెళ్లాలి.

పగటి వేళల్లో చెట్ల పొదల్లోకి, గడ్డి బాగా ఉన్న ప్రదేశాల్లోకి వెళ్లకపోవడం మంచిదిరాత్రి వేళ ఇంటి పరిసరాల్లో చిన్న దీపాలను వెలిగించాలి.

పాత సామగ్రిలోకి పాములు వెళ్లకుండా బోర్లించి పెట్టాలి.

కాళ్లకు బూట్లు, పాదాలు పూర్తిగా కప్పి ఉంచే చెప్పులు వేసుకోవడం మంచిది. భయపడొద్దు

పాము కరిచిన చోట రెండు గుర్తులు కనిపిస్తాయి. వీటి ఆధారంగా పాము కాటు వేసిందని గుర్తించాలి. అక్కడ కత్తితో ప్లస్ గుర్తు ఆకారంలో కోయాలి. రక్తం బాగా కారిపోయేలా చూడాలి. కాటుకు కొంత పైభాగంలో తాడు లేదా రుమాలుతో కట్టు కట్టి ఆసుపత్రికి తీసుకెళ్లాలి. మందులు అందు బాటులో ఉన్నాయిపాము కాటుకు విరుగుడు మందుగా యాంటీ వీనమ్‌ను ఉపయోగిస్తాం. యాదాద్రి భువనగిరి జిల్లాలో జిల్లా ఆసుపత్రి భువనగిరితో పాటు ఏరియా ఆసుపత్రులు రెండు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు 2, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 18 ఉన్నాయి. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉంచాం. పాముకాటుకు గురైన వారు మూఢనమ్మకాలకు చోటివ్వకుండా నేరుగా ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలి.

# మారుమూల ప్రాంతాల్లో మెరుగైన వైద్యం




గోదావరిఖని : ప్రత్యేక వైద్య నిపుణులతో మారుమూల గ్రామాల రోగులకు సైతం సేవలందించాలనే లక్ష్యంతో కేంద్ర కుటుంబ సంక్షేమ శాఖ ప్రవేశపెట్టిన 'ఈ-సంజీవని' సత్ఫలితాలనిస్తోంది. జాతీయ స్థాయిలో టెలీమెడిసిన్ సేవలను అందిస్తున్న ఈ విధానంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి రోజు ఒక్కో విభాగానికి చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో అందుబాటులో ఉంటూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఫోన్ ద్వారా వచ్చే సమస్యలకు పరిష్కారం చూపిస్తారు. ప్రధానంగా జనరల్ మెడిసిన్, స్త్రీ వైద్య విభాగంలో ఈ సేవలు చాలా మందికి ఉపయోగపడుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లోని వారు వైద్య సేవల కోసం సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళుతుంటారు. ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ వైద్యులు మాత్రమే అందుబాటులో ఉంటుండగా ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు పొందాలంటే నగరాలకు వెళ్లాల్సిందే. అంతదూరం వెళ్లాలంటే సమయంతో పాటు డబ్బు లేక చాలా మంది ఆరోగ్య కేంద్రానికే పరిమితమవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాపాయ పరిస్థితులు చోటు చేసుకోవచ్చు. అలాంటి ఇబ్బందులు తప్పించాలనే లక్ష్యంతో కేంద్రం 'ఈ-సంజీవని' పేరుతో జాతీయ స్థాయిలో టెలీమెడిసిన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది.

**నాలుగు నెలలు... 1338 మందికి ప్రయోజనం**

మార్చి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో టెలీమెడిసిన్ విధానాన్ని 1338 మంది సద్వినియోగం చేసుకున్నారు. ఇందులో గైనకాలజీ 417, ఆప్తమాలజీ 226 జనరల్ మెడిసిన్ 230, జనరల్ సర్జరీ 220, ఆర్థోపెడిక్ 245 మంది సేవలు పొందారు.

**వివరాల నమోదు ఇలా**

టెలీ మెడిసిన్ ద్వారా వైద్య సేవలు పొందాలనుకుంటే ముందుగా చరవాణిలో 'ఈ-సంజీవని' యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. తమ చరవాణి నంబరుతో వివరాలను యాప్‌లో నమోదు చేయాలి. ఈ యాప్‌లో ఏయే రోజుల్లో ప్రత్యేక వైద్య నిపుణులు ఏయే సమయాల్లో అందుబాటులో ఉంటారో వివరాలుంటాయి. దాని ప్రకారం ఫోన్ చేసి ఆయా వైద్య నిపుణుల సలహాలను తీసుకోవచ్చు. ఒక్కసారి యాప్‌లో వివరాలు నమోదు చేస్తే ప్రతి సారి మనం పొందుతున్న వైద్య సేవల వివరాలు అందులో నమోదవుతుంటాయి. గ్రామీణ ప్రాంతాల్లోని చాలా మందికి స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉండకపోవచ్చు. అలాంటి వారు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్తే అక్కడి వైద్యులు, వైద్య సిబ్బంది చరవాణి ద్వారా 'ఈ-సంజీవని'కి ఫోన్ చేసి చికిత్స కోసం వచ్చిన వారి ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక వైద్య నిపుణులతో మాట్లాడతారు. రోగులకు అందించాల్సిన వైద్య సేవలను స్థానిక వైద్యులు, సిబ్బంది ద్వారా పొందవచ్చు. దేశవ్యాప్తంగా ప్రత్యేక వైద్య నిపుణులను సంప్రదించే అవకాశం 'ఈ-సంజీవని'లో ఉంటుంది. రోగి ఆరోగ్య స్థితిగతులపై సంక్షిప్త సమాచారంలో వివరాలను నమోదు చేసినా సంబంధిత ప్రత్యేక వైద్య నిపుణులు మందుల వివరాలను సంక్షిప్త సమాచార రూపంలో పంపిస్తారు.

**అందుబాటులో నిపుణుల సేవలు**

టెలీమెడిసిన్ విధానంతో చాలా మందికి ప్రయోజనం చేకూరుతుంది. ప్రత్యేక వైద్య సేవల కోసం పెద్దపల్లి, కరీంనగర్ వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే ప్రత్యేక నిపుణుల సేవలు అందుకుంటున్నారు. ప్రత్యేక వైద్య నిపుణుల సలహాల మేరకు వైద్య సేవలు అందిస్తున్నాం. మారుమూల ప్రాంతాలకు చెందిన నిరుపేదలకు ఈ విధానం వరంగా చెప్పుకోవచ్చు.

పారిజాతం, సీవో, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, లక్ష్మీపురం

# వసూళ్లకు ఉరుకులు.. పరుగులు!




ఖమ్మం : పాత వాటికి తోడు... కొత్తగా పెరుగుతున్న బకాయిల వసూళ్లకు విద్యుత్తు సంస్థ అధికారులు హైరానా పడుతున్నారు. గృహజ్యోతి నమోదైన వారు సైతం బిల్లు చెల్లింపులు ఆపుతుండటంతో భారం భారీగా పెరుగుతోంది. సంస్థ లక్ష్యాలు పెంచడం, వినియోగదారులు కొందరు మొండికేయడం జిల్లా అధికారులకు తలనొప్పిగా తయారైంది. వినియోగదారులకు అవగాహన కల్పించడంతోపాటు, వసూలుకు సిబ్బంది, అధికారులు పరుగులు పెడుతున్నారు.

**గృహజ్యోతి ఇలా...**

గృహజ్యోతి ద్వారా నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించే రేషన్‌కార్డు కలిగిన గృహ వినియోగదారులకు ఉచిత పథకాన్ని చేపట్టింది. ప్రజాపాలన దరఖాస్తుతో రిజిస్టరైన సర్వీసుకు ఈ పథకం వర్తిస్తుంది. జిల్లాలో మొత్తం 4,32,764 గృహ విద్యుత్తు సర్వీసులున్నాయి. వీటిలో ప్రస్తుతం 2.44 లక్షల మంది గృహ వినియోగదారులు ఇందులో నమోదు చేసుకున్నారు. వీరిలో సొంత వినియోగదారులు, అద్దెకు నివసిస్తున్నవారు సైతం ఉన్నారు. వారి విద్యుత్తు సర్వీసుపై నెల రోజుల్లో 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగిస్తే జీరో బిల్లు అందజేస్తారు. అర్హులై జీరో బిల్లు పొందే వారి సంఖ్య ప్రతినెలా మారుతుంది.

**జిల్లాలో బకాయిలు**

గృహ, ఇతర విద్యుత్తు వినియోగదారుల బకాయిలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రతినెలా సుమారు రూ. 50 కోట్లు బిల్లుల రూపంలో డిమాండ్ వస్తుంది. దీనిలో 85-90 శాతం వసూలు చేస్తుంటారు. మిగిలిన 10-15 శాతం పేరుకుపోతోంది. దీనిలో తదుపరి తీవ్రమైన ఒత్తిడి చేస్తేనే వసూళ్లు జరుగుతుంటాయి. ఇప్పటికే జిల్లాలో మొత్తంగా రూ. 100 కోట్లకుపైగా బకాయి ఏర్పడింది.

గృహజ్యోతిలో రిజిస్టరై వేసవి కారణంగా అధిక విద్యుత్తు వినియోగంతో 200 యూనిట్లు దాటి బిల్లు పొందిన వారిలో కొందరు బిల్లు చెల్లించకపోవడంపై అధికారుల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు 3,360 మంది రూ. 1.74 కోట్లు బకాయి పడినట్లు అధికారులు తెలిపారు.

నాన్ గృహజ్యోతి వినియోగదారులు (రేషన్ కార్డు అనుసంధానం కాని సర్వీసులు) 66,873 మంది రూ. 13.35 కోట్లు బకాయి పడ్డారు.

ఎల్టీ(లో టెన్షన్) 12,300 ప్రభుత్వ సర్వీసులతో రూ. 66.92 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి.

ఎల్టీ ప్రైవేటు సర్వీసులతో రూ. 34.24 కోట్లు బకాయి ఉండిపోయింది. భారీగా పెరుగుతున్న బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో అధికారులు పరుగులు పెడుతున్నారు.

పాత, కొత్త బకాయిల వసూళ్లకు ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నాం. సిబ్బంది కృషి చేస్తున్నారు. అవగాహన కల్పించడంతో వినియోగదారులు స్పందించి బిల్లులు చెల్లిస్తున్నారు. రెవెన్యూ వసూళ్ల లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎ. సురేందర్, ఎస్ఈ

# పల్లె సందర్శన.. పది అంశాల పరిశీలన

ఆలేరు : జిల్లాస్థాయి అధికారులు తరచూ పల్లెలు సందర్శిస్తూ.. తమశాఖలనే కాకుండా.. మరో పది అంశాలను అనుశీలన, పరిశీలన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం ఈ నెల 11న అన్ని జిల్లాల పాలనాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. క్షేత్ర స్థాయిలోని అన్ని ప్రభుత్వ విభాగాలు మరింత పారదర్శకంగా పనిచేయాలన్నదే ఈ కార్యక్రమ లక్ష్యం. సాధారణంగా పల్లెను సందర్శించే ఉన్నతాధికారులు తమకు సంబంధించిన శాఖ వ్యవహారాలను మాత్రమే పరిశీలించి వస్తుంటారు. ఇక నుంచి అలా కాకుండా.. ప్రభుత్వం నిర్దేశించిన మరో పది విషయాలు పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

ప్రతి నెలా టూర్ డైరీ వివరాలు... జిల్లా పాలనాధికారి ప్రతి నెలా 5వ తేదీలోగా టూర్ డైరీని ప్రభుత్వ కార్యదర్శికి సమర్పించాల్సి ఉంటుంది. అధికారులు పాఠశాలలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలను తరచూ సందర్శిస్తూ ఉంటారు. పాఠశాలల్లో ప్రార్థన సమయానికి, గ్రామాలలో చెత్త తరలింపు విషయాలను ప్రత్యక్షంగా పరిశీలించి తగు సూచనలు ఇవ్వనున్నారు.

సాంఘిక సంక్షేమం:ప్రభుత్వ పరంగా అమలవుతున్న సామా జిక పింఛన్లు, సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు దరిచేరుతున్న తీరు,. సక్రమ పంపిణీ.

గృహ నిర్మాణం:గ్రామంలో ప్రభుత్వ పరం గా ఇంటి నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వ పరంగా అందుతున్న సాయం..

రహదారులు మౌలిక వసతులు:గ్రామంలో రహదారుల పరిస్థితి, రవాణా సౌకర్యాలు.

పురపాలన:శానిటేషన్ పనులు, తాగునీటి సరఫరా, పట్టణ ప్రణాళిక.

నీటి సరఫరా, పారిశుద్ధ్యం:గ్రామాలలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య



చర్యలు, టాయిలెట్లు, మరుగుదొడ్ల నిర్వహణ.

మహిళా, శిశు సంక్షేమం:మహిళలు, శిశు సంక్షేమం కోసం అమలులో ఉన్న సంక్షేమ పథకాల అమలు తీరు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ వసతి గృహాల పనితీరు.

విద్య:గ్రామస్థాయిలో పాఠశాలల సందర్శన, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, బోధన, విద్యార్థుల సామర్థ్యాల ప్రగతి.

వ్యవసాయం:గ్రామాలలో రైతులకు అందుతున్న విత్తనాలు, ఎరువులు, పంటల సాగు, దిగుబడుల అంచనాలు.

ప్రజా పంపిణీ:గ్రామంలో ప్రజలకు ప్రభుత్వ చౌకదుకాణాల ద్వారా అందుతున్న రాయితీ సరకుల పంపిణీ తీరు.

వైద్య సౌకర్యాలు:పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, సబ్‌సెంటర్ల పనితీరు, వీటి ద్వారా ప్రజలకు అందుతున్న వైద్యసేవలు, వసతులు, వైద్యులు, సిబ్బంది పనితీరు, ఖాళీలు.

# బతికేలా నాటేద్దాం.. భవిత మారుద్దాం

సూర్యాపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవం ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఎనిమిది విడతలుగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో లక్షలాది మొక్కలు నాటిన విషయం తెలిసిందే. ఈ సంవత్సరం వన మహోత్సవం పేరిట నాటే ప్రతి మొక్క బతికించే బాధ్యతను ప్రభుత్వం అధికారులకు అప్పగించింది. ఈ సారి మండలాలకు లక్ష్యాలను తక్కువగానే ఇచ్చారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు సమన్వయంతో స్థలాలను పరిశీలించి మొక్కలు నాటేందుకు అనువుగా ఉన్న వాటిని గుర్తించారు. నర్సరీల్లో అవసరమైన మొక్కలను సిద్ధం చేశారు. యాదాద్రి భువనగిరిలో సోమవారం ఈ కార్యక్రమం ప్రారంభమైంది. సూర్యాపేటలో ఈ నెల 18న, నల్గొండలో వారం రోజుల్లో అధికారికంగా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటుతున్నారు.

లోపాలను అధిగమిస్తేనే పచ్చదనం

గతంలో ఖాళీ స్థలాల్లో, ప్లాట్ల ముందు, విద్యుత్తు తీగల కింద మొక్కలు నాటించారు. దీంతో మొక్కలు నాటే

లక్ష్యం చేరినా.. ఫలవంతం కాని పరిస్థితి. ప్లాట్ల ముందువారు ఆదిలోనే తొలగించగా, విద్యుత్తు తీగల కింద నాటినవి ఏపుగా పెరిగిన తర్వాత



తీగలకు అడ్డొస్తున్నాయని ఆ శాఖ అధికారులు కొట్టేస్తున్నారు. ఈ సారి వీటి నుంచి బయట పడేందుకు ముందుగానే ఏపీవోలు, సాంకేతిక సిబ్బంది, ఈసీలు, క్షేత్ర సహాయకులు, కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి స్థలాలను ఎంపిక చేశారు. ఎన్ని మొక్కలు నాటవచ్చో ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. ఈసారి ఇళ్లల్లో, గట్లపై, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు స్థలాల్లో, గతంలో ఎండిన చోట, విద్యుత్తు తీగల కింద మొక్కలు నాటడం లేదు.

లక్ష్యం మేరకు సన్నద్ధం:సతీష్, డీఎఫ్‌వో, సూర్యాపేట

వన మహోత్సవంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు అన్ని మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నర్సరీల్లో లేని మొక్కలను బయట నుంచి తెప్పిస్తున్నాం. వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యాలకు సరిపోయే విధంగా నర్సరీల్లో సిద్ధం చేస్తున్నాం. పండ్లు, పూలు, ఇతర మొక్కలు ఉండేలా చూసుకుంటున్నాం.

నాటుతున్న మొక్కలివి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖలకు 130.95 లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. వర్షాలు కురుస్తుండటంతో ఇప్పటికే 41.25 లక్షల మొక్కలు నాటారు. వన మహోత్సవంలో పండ్ల, నీడనిచ్చే మొక్కలు ప్రాధాన్యం ఇచ్చేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ప్రధానంగా స్థానిక వాతావరణానికి అనుకూలంగా పెరిగే వాటిని ఎంపిక చేసుకున్నారు. గుర్తించిన స్థలాల్లోనే వాటిని నాటేలా సన్నాహాలు చేపడుతున్నారు.

# మిల్లుల్లో ధాన్యం ఉందా..?

కామారెడ్డి : ప్రభుత్వం రైస్‌మిల్లులకు ప్రతి ఏడాది వానాకాలం, యాసంగి సీజన్లలో ధాన్యాన్ని అందిస్తుంది. మిల్లులతో ఒప్పందం కుదుర్చుకుని బియ్యాన్ని తీసుకుంటుంది. అయితే కొందరు మిల్లర్లు ధాన్యాన్ని సొంత అవసరాలకు వాడుకుని నిల్వలు లేకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. రెండు మిల్లులపై కేసులు కూడా నమోదు చేశారు. ఇవే కాకుండా మరికొందరు మిల్లర్లు కూడా ధాన్యాన్ని మాయం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాలనాధికారి రంగంలోకి దిగారు. అన్ని మిల్లులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం వారివద్ద ఉందో లేదో చూడాలని ఆదేశించారు. ఒకవేళ మిల్లుల్లో ధాన్యం లేకుంటే సదరు యజమానికి తాఖీదులు జారీ చేయాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారి ఆదేశాలతో క్షేత్రస్థాయి తనిఖీలకు పౌరసరఫరాలశాఖ అధికారులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

**మూడు సీజన్ల నుంచి..**

ప్రభుత్వం నుంచి తీసుకున్న మూడు సీజన్ల ధాన్యం ప్రస్తుతం మిల్లుల్లో ఉంది. ఇందులో 2022-23 ఏడాదికి సంబంధించిన యాసంగి సీజన్ ధాన్యానికి అప్పటి ప్రభుత్వం గ్లోబల్ టెండర్లు ఆహ్వానించింది. టెండర్ నిర్వాహకులు మొన్నటి వరకు ధాన్యాన్ని తీసుకువెళ్లలేదు. అది మిల్లుల్లోనే మూలుగుతోంది. గ్లోబల్ టెండర్ నిర్వాహకులు ఆయా మిల్లుల నుంచి ధాన్యాన్ని తీసుకువెళ్లడం ఖర్చుతో కూడిన పనిగా భావించినట్లు తెలుస్తోంది. అందుకే ఎవరి మిల్లుల్లో ఎంత ధాన్యాన్ని టెండర్‌లో దక్కించుకున్నారో ఆ ధాన్యాన్ని అదే మిల్లు యజమానికి ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. జిల్లాలో కొందరు మిల్లర్లు ఆ ధాన్యానికి డబ్బులు కూడా చెల్లిస్తున్నారు. అయితే గ్లోబల్ టెండర్ వారు దక్కించుకున్న ధాన్యాన్ని కొందరు మిల్లర్లు పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ వారు ఇటీవల జిల్లాలోని భిక్కనూరు, పల్వంచ, సదాశివనగర్ మండలాల్లోని మూడు మిల్లుల్లో తనిఖీ చేసి నివేదిక రూపొందించారు. ఇది కాకుండా 2022-23 వానాకాలం సీజన్, 2023-24 యాసంగి సీజన్ ధాన్యం మిల్లుల్లో ఉంది. ఈ నిల్వలు సరిగా ఉన్నాయో లేదో తనిఖీల్లో వెల్లడికానుంది.

**నోటీసుల జారీ..**

2021-22 వార్షిక ఏడాదిలో 31 మంది మిల్లర్లు లక్ష్యం మేర బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వకపోవడంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. 2022-23 ఏడాదిలో కూడా 36 మంది మిల్లర్లకు నోటీసులు జారీ అయ్యాయి. కొందరు మిల్లర్లు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లుగా తెలుస్తోంది. రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి తిరిగి ప్రభుత్వానికి సీఎంఆర్‌గా అందజేస్తున్నారు. ప్రస్తుతం అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తే ఎంత మంది వద్ద ధాన్యం నిల్వలు ఉంది లేనిది బహిర్గతమవుతుంది.

# డెంగీ పడగ.. డిఫ్తీరియా ముప్పు!

హైదరాబాద్ : వానలు కురుస్తుండటంతో గ్రేటర్ వ్యాప్తంగా ప్రమాదకరమైన డెంగీ, డిఫ్తీరియా కేసులు పెరుగుతున్నాయి. బాధితుల్లో ఎక్కువ శాతం చిన్నారులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. నిలోఫర్‌లో గత రెండు రోజుల్లో ఏడుగురు చిన్నారులు డెంగీకి చికిత్స తీసుకుంటున్నారు. గాంధీలో నలుగురు చిన్నారులు అదే వ్యాధితో చేరారు. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి వస్తున్న డెంగీ, డిఫ్తీరియా కేసుల్లో చిన్నారులు సైతం ఉంటున్నారు.

టీకాలకు దూరంగా ఉండటంతో.. గ్రేటర్‌లో దాదాపు 30 శాతం మంది చిన్నారులు ఇప్పటికీ డిఫ్తీరియా టీకాలకు దూరంగా ఉండటం.. డోసులు కొనసాగించక పోవడంతో దాని బారిన పడుతున్నారు. చిన్నారుల్లో ఒకరికి సోకితే...ఇంకొకరికి సులువుగా అంటుకుంటుంది. చికిత్సల్లో నిర్లక్ష్యం చేస్తే కొన్నిసార్లు ప్రాణాలకు ముప్పుంటుందని వైద్య



నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది టాన్సిల్స్, గొంతు, ముక్కు, చర్మాన్ని ప్రభావితం చేస్తుంది. చలి, జ్వరం, బిగ్గరగా దగ్గు, గొంతులో మంట, నాలుక పూత, శ్వాస తీసుకోవడం, మింగడంలో ఇబ్బంది, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలుంటాయి.

**ఈ జాగ్రత్తలు ముఖ్యం..**

జ్వరాల విషయంలో అశ్రద్ధ వద్దు. ఆఖరి నిమిషంలో వైద్యులను సంప్రదిస్తే కొన్నిసార్లు పరిస్థితి విషమంగా మారుతుంది.

పాఠశాలల వద్ద పారిశుద్ధ్యం మెరుగుకు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలకు కాళ్లు, చేతులు కప్పిఉంచేలా దుస్తులువేసి పంపాలి. మాస్క్‌తోపాటు శానిటైజర్ తప్పకుండా పిల్లల వద్ద ఉంచాలి.

పిల్లలు లేదా పెద్దలకు జ్వరం వస్తే పారాసిటమాల్ తప్ప..వైద్యుల సూచనల లేకుండా ఇతర మందులు వేయకూడదు. 24-48 గంటల్లో తగ్గనప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలి.

బాగా కాచి చల్లార్చిన నీళ్లతోపాటు వేడి ఆహారం ఇవ్వాలి. పిల్లలను బయట ఆహారానికి దూరంగా ఉంచాలి.

101 డిగ్రీల కంటే జ్వరం, తీవ్ర తలనొప్పి, కళ్లవెనుక నొప్పి, చలిజ్వరం, వాంతులు, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, రక్తంలో ఆక్సిజన్ తగ్గడం, బీపీ తగ్గిపోవడం, శరీర భాగాల నుంచి రక్తస్రావం కావడం వంటి లక్షణాలుంటే వెంటనే ఆసుపత్రికి తరలించాలి.

# 2.80 లక్షల రైతులకు రుణమాఫీ!

కరీంనగర్ : ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు తీపి కబురు చెప్పింది. రూ.2 లక్షల వరకు పంట కోసం తీసుకున్న రుణాన్ని మాఫీ చేసేందుకు ఉత్తర్వులను వెలువరించింది.. ఆ మార్గదర్శకాల ప్రకారం నాలుగు జిల్లాల అధికారులు అర్హుల లెక్క తీయనున్నారు. వ్యవసాయశాఖ అధికారులతోపాటు లీడ్ బ్యాంక్ మేనేజర్లు జిల్లాల వారీగా ఎంతమంది ఈ రుణమాఫీ పథకం పరిధిలోకి వస్తారనే విషయమై దృష్టి సారిస్తున్నారు. భూమి ఉన్న ప్రతి రైతు బ్యాంకులో తీసుకున్న అప్పు, వడ్డీ కలిపి రూ.2 లక్షల వరకు ఉంటే మాఫీ చేస్తారు. అంతకుమించి ఉన్న మొత్తాన్ని అన్నదాత చెల్లించుకుంటే మిగతాది రుణమాఫీ పరిధిలోకి వస్తుంది.

సుమారు రూ.4 వేల కోట్ల వరకు అవసరం

నాలుగు జిల్లాల పరిధిలో దాదాపుగా 2.80 లక్షల మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా తేలే అవకాశముందని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ మధ్యకాలంలో తీసుకున్న రుణానికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. ఈసారి పక్కాగా రేషన్‌కార్డును ప్రామాణికంగా పెట్టడంతో ఇవి ఉన్న రైతులే లబ్ధిదారులుగా మారనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మాఫీ కోసం సుమారుగా రూ.4 వేల కోట్ల వరకు నిధులు అవసరముంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎక్కువగా చిన్న కమతాల్లో పంటలు వేసిన వారే గతంలో పంటసాగు కోసం స్వల్పకాలిక రుణాలు తీసుకున్నారు. పైగా గత సర్కారు గతేడాది రూ.లక్ష లోపు వారికి రుణమాఫీ చేసింది. దీంతో అంతకన్నా ఎక్కువ ఉన్న వారి బకాయిలు అలాగే ఉండిపోయాయి. ఆ మొత్తం ప్రతి నెలా వడ్డీతో కలిపి పెరిగిపోయింది. వ్యవసాయశాఖ అధికారులకు



వచ్చిన నమూనా ప్రకారం గ్రామాల వారీగా అర్హుల వివరాలను సేకరించనున్నారు. ప్రతి బ్యాంకు పరిధిలో సలహాలు, సంప్రదింపుల కోసం ఓ నోడల్ అధికారిని నియమించ నున్నారు.

**గతంలో ఇలా..**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరవాత అప్పటి తెరాస ప్రభుత్వం 2014లో రుణమాఫీ చేసింది. అప్పుడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4,48,634 మంది రైతులకు రూ.2,221 కోట్లను పంట రుణాలుగా ఇచ్చినట్లు బ్యాంకర్లు మొదట లెక్క తేల్చారు. 28,083 మంది రైతులు బంగారం తాకట్టు పెట్టి రూ.284 కోట్లు రుణం తీసుకున్నట్లు గుర్తించారు. 2014 మార్చి 31 వరకు 4,76,717 మందికి రూ.2,505 కోట్లు అవసరమని ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో అప్పుడున్న నిర్ణీత వ్యవధి ప్రకారంగా పరిశీలన జరిపి 3,84,106 మందిని రుణమాఫీకి అర్హులని తేల్చారు. ఇందుకోసం రూ.1683 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మొదట రూ.25 వేలు, తరువాత రూ.50వేల రుణాల వారికి ప్రయోజనం కలిగింది. తరువాత రూ.లక్ష వరకు ఉన్నవారికి మాఫీ చేశారు. రూ.లక్షకుపైగా రుణం ఉన్నవారు అధికంగానే ఉన్నారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో రూ.రెండు లక్షల లోపు రుణం తీసుకున్న ప్రతి ఒక్కరికి మాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల తరువాత అందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టింది.

# ఉచిత జలం.. సిబ్బంది మాయాజాలం



హైదరాబాద్ : అంటగడుతున్న వైనం ఎస్ఆర్‌నగర్‌లో ఉండే శ్రీనివాస్‌కు చెందిన అపార్ట్‌మెంట్‌లో ఇటీవల నీటి మీటరు పాడైంది. జలమండలి సిబ్బందికి ఫిర్యాదు చేశాడు. వెంటనే కొత్త మీటరు పెట్టుకోవాలని, లేదంటే ఉచిత నీటి పథకం వర్తించదని చెబుతూ.. తామే మీటర్ సరఫరా చేస్తామని సూచించారు. సిబ్బంది చెప్పిన ధర బహిరంగ మార్కెట్ ధర కంటే మూడు రెట్లు ఉండడంతో నిరాకరించారు. గ్రేటర్ వ్యాప్తంగా చాలామంది వినియోగదారులు ఇలాంటి పరిస్థితే ఎదుర్కొంటున్నారు.

**గ్రేటర్‌లో ఉచిత నీటి పథకం వర్తించాలంటే..** ప్రతి నల్లాదారుడు తన ఆధార్ నంబర్‌ను కస్టమర్ అకౌంట్ నంబర్‌కు అనుసంధానం చేయాలి. తప్పనిసరిగా నల్లాకు పెట్టిన మీటర్ పనిచేస్తుండాలి. ఇక్కడే జలమండలి సిబ్బంది పంట పండుతోంది. ఇప్పటికే చాలా మీటర్లు రిపేర్లు కావడం, పాడైపోవడంతో కొత్తవి అవసరమవుతున్నాయి. ఇందుకు గతంలో జలమండలి దాదాపు 15 కంపెనీలను ఎం-ఫ్యానల్ చేసింది. మీటర్లు పాడైనా, కొత్తవి పెట్టుకోవాలన్నా.. ఈ కంపెనీల నుంచే కొనుగోలు చేయాలని సూచించింది. చాలామంది వినియోగదారులకు ఈ మీటర్లు ఎక్కడ దొరకుతాయో తెలియదు. దీన్ని కొందరు సిబ్బంది అనుకూలంగా మార్చుకుంటున్నారు. అర అంగుళం నల్లా కనెక్షన్‌కు రూ.3వేల వరకు మీటర్ ధర ఉండగా.. సిబ్బంది ఆరేడు వేలు వసూలు చేస్తున్నారు. బహుళ అంతస్తుల భవనాలకు అమర్చే ఏఎంఆర్ మీటర్లకు రూ.20-30 వేల వరకు ఉంటే.. రూ.50 వేలపైనే డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నల్లాదారులు బహిరంగ మార్కెట్‌లో మీటర్లు కొని అమర్చుకుంటున్నా.. రీడింగ్ తీయడానికి వచ్చే సిబ్బంది కొర్రీలు పెడుతున్నారు. ఉచిత పథకం నుంచి మినహాయిస్తామని చెబుతుండటంతో నల్లాదారులు బెంబేలెత్తుతున్నారు.

**12వేల ఏఎంఆర్ మీటర్లు మూలకు..**

గతంలో జలమండలి కోట్లు పెట్టి ఆటోమేటిక్ నీటి మీటర్లు కొనుగోలు చేసింది. వీటిలో 12వేల మీటర్లు పాడైపోయినట్లు జలమండలి లెక్కలు వేసింది. అప్పట్లో కమీషన్లకు కక్కుర్తి పడి నాసిరకం మీటర్లను కొనుగోలు చేశారనే ఆరోపణలున్నాయి. ఒక్కో మీటర్‌ను రూ.30 వేల నుంచి లక్షలోనే కొనుగోలు చేసి సరఫరా చేసింది. తర్వాత ఈ డబ్బులను నల్లాదారుల నుంచి వసూలు చేసింది. ప్రస్తుతం చాలా మీటర్లు పాడైపోవడంతో జలమండలి సిబ్బంది దృష్టికి తీసుకొస్తున్నారు. ఇదే అదనుగా భారీ ఎత్తున వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. ఉచిత నీటి పథకం నిలిచిపోనుండటంతో వేరే దారి లేక సిబ్బంది అడిగినంత ముట్టజెబుతున్నారు.

# కాలుష్య కార్ఖానా.. కాసుల ఖజానా



హైదరాబాద్: అక్రమ సంపాదన కోసం జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్‌లోని ఓ ఉన్నతాధికారి కాలుష్యాన్ని వెదజల్లే కారా?నాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. మామూళ్లు తీసుకుని జనావాసాల మధ్య కొత్త పరిశ్రమలకు అనుమతిస్తూ, దాడుల పేరుతో పాత కంపెనీల నుంచి నెలవారీగా వసూళ్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో 1,800 పరిశ్రమలు ఉండగా.. వాటిలో 1,450 అనుమతి లేని కాలుష్యకారక కేంద్రాలని, బల్దియా నిఘా కొరవడటంతో సమస్యను అదుపు చేయలేకపోతున్నామని టాస్క్‌ఫోర్స్ పోలీసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ కారా?నాల కాలుష్యంతో స్థానికంగా ఉండలేకపోతున్నామని ఆయా ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమకో ధర నిర్ణయించి, అడిగినంత ఇవ్వకపోతే కూల్చివేతలకు పాల్పడుతున్నారంటూ బాధితులు తాజాగా జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేయడం గమనార్హం.

**తనిఖీల పేరుతో...** నిషేధిత వస్తువుల తయారీ పరిశ్రమలకు కాటేదాన్, గగన్‌పహాడ్, జల్‌పల్లి, శ్రీరామ్‌కాలనీ, హసన్‌నగర్, టాటానగర్, అత్తాపూర్, రాంబాగ్ ప్రాంతాలు అడ్డాలుగా మారాయి. ప్లాస్టిక్ కవర్లు, సీసాలు, గ్లాసులు, ఇతరత్రా వస్తువులకు సంబంధించిన కర్మాగారం పెట్టేందుకు వ్యాపారులు ఆ ప్రాంతాలనే ఎంచుకొంటున్నారు. బల్దియాలోని కొందరు అవినీతి అధికారులు ఇస్తున్న ప్రోత్సాహమే అందుకు కారణం. ఇద్దరు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది.. నిర్మాణంలో ఉన్న పరిశ్రమల వద్ద రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకు వసూలు చేస్తున్నారని, ఇవ్వకపోతే ఉపకమిషనర్ కూల్చివేస్తారని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఓ బాధితుడు తాజాగా కేంద్ర కార్యాలయాన్ని ఆశ్రయించారు. నేషనల్ లాడ్జి, ఓ బిస్కట్ కంపెనీ గోదాములను అడ్డాగా చేసుకుని డబ్బులు వసూలు చేస్తుంటారని వాపోయారు.

అక్రమ వసూళ్ల కోసం రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు పలుచని ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ఇతర హానికర వస్తువుల తయారీ కేంద్రాలను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలున్నాయి.

**ఇతర సర్కిళ్లలోనూ..** జీహెచ్ఎంసీ పరిధిలో ఆరు జోన్లు, వాటి కింద 30 సర్కిళ్లు .. ఒక్కో సర్కిల్‌లో 4-6 డివిజన్లు ఉన్నాయి. కారా?నాల విషయంలో.. కాలుష్య నియంత్రణ మండలి, జీహెచ్ఎంసీ అధికారుల ప్రమేయం ఉంటుంది. అదే అదనుగా.. కొందరు సర్కిల్ అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలను సొమ్ము చేసుకుంటున్నారు. కనిపించిన ప్రతి నిర్మాణాన్ని ఫొటో తీసుకోవడం, ఆఫీసుకు వెళ్లాక టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో నిర్మాణదారులను పిలిపించుకుని లంచం డిమాండ్ చేస్తున్నట్లు బాధితులు గగ్గోలు పెడుతున్నారు. రాజేంద్రనగర్, అల్వాల్, పటాన్‌చెరు సర్కిళ్ల ఉన్నతాధికారులపై ఈ తరహా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

# అడుగంటిన భూగర్భ జలాలు.. ఆందోళనలో అన్నదాత



కోనరావుపేట: ఈ ఏడాది వర్షాలు సాధారణం కంటే ఎక్కువ కురుస్తాయని వాతావరణ శాఖ చల్లని కబురు అందించడంతో రైతన్నలు ఉత్సాహంతో ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయనే సంకేతాలతో రైతులు జూన్ మొదటి వారంలోనే వరినారు పోశారు. పచ్చిరొట్ట ఎరువులు సైతం వేశారు. నెలన్నర కావస్తున్నా ఆశాజనకంగా వర్షాలు కురవడం లేదు. దీంతో వ్యవసాయ, బోరు బావుల్లో భూగర్భ జలాలు పడిపోవటంతో పచ్చిరొట్ట ఎరువు దమ్ము చేయటం ప్రశ్నార్థకంగా మారింది. నాటు వేయటానికి అదను దాటిపోవటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు.

**1.80 లక్షల ఎకరాల్లో అంచనా..**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ ఏడాది 1.80 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. జూన్‌లో వరినారు మడులను సిద్ధం చేశారు. నెలరోజుల వ్యవధిలో నాటు వేయాల్సిన రైతులు వర్షాలు కురవక వేయటం లేదు. జూన్‌లో 11.59 మీటర్లకు భూగర్భ జలాలు పడిపోయాయి. జులైలో కూడా వర్షాలు పడకపోతే 13 మీటర్ల మేర పడిపోయే ప్రమాదం నెలకొంది. గత ఏడాది జూన్‌తో పోలిస్తే ఈ సంవత్సరం 1.82 మీటర్ల మేర కిందకు భూగర్భ జలాలు పడిపోయాయి.


**దమ్ము చేయడం ప్రశ్నార్థకంగా మారింది**

జూన్ మొదటి వారంలో నాలుగు ఎకరాలలో వరిసాగు చేయటానికి నారు పోశాను. వ్యవసాయ బావిలో నీరు అడుగంటడంతో నారు మడిని కాపాడుకోవటం కష్టంగా మారింది. వర్షాలు లేక పచ్చిరొట్ట ఎరువు దమ్ము చేయటం ప్రశ్నార్థకంగా మారింది. ముదిరిన నారుతో నాటు వేస్తే ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే అవకాశం లేదు.

పొన్నం చిన్న రాజేశం రైతు ధర్మారం

# సిగ్నల్ లేక.. సేవలందక..!

కొత్తగూడెం: 4జీ నుంచి 5జీకి దేశం పరుగులు పెడుతున్నా.. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్స్ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతున్నకొద్దీ ప్రజలకు సేవలన్నీ అంతర్జాలంలోనే అందుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు, రైతుభరోసా వంటి సంక్షేమ పథకాలు బ్యాంకు ఖాతా ద్వారా వర్తిస్తుండటంతో వాటిని పొందాలంటే కొన్ని కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. ఈసమస్యను పరిష్కరించటానికి అవసరమున్నచోట వినియోగదారుల సేవా కేంద్రాలు ఏర్పాటుచేయాలని బ్యాంకులు నిర్ణయించుకున్నా.. సిగ్నల్స్ సమస్య ఎదురవుతుండటంతో సేవలు అందించలేకపోతున్నాయి. బ్యాంకు సేవలకు దూరంగా ఉన్న 19 మారుమూల ప్రాంతాలను అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లోని వృద్ధులు, దివ్యాంగులు సైతం పింఛన్ల కోసం ప్రతినెలా మండల కేంద్రాలకు వెళ్లాలి. చర్ల మండలం పూసుగుప్ప, ఆళ్లపల్లి మండలం అడవిరామవరం గ్రామస్థులైతే బ్యాంకు సేవల కోసం పది కి.మీ. దూరం ప్రయాణించాలి. ఈప్రాంతాల్లో సేవలందించటానికి వినియోగదారుల సేవా కేంద్రాల ఏర్పాటుకు బ్యాంకులు ముందుకొచ్చినా సిగ్నల్ సమస్య కారణంగా కార్యరూపం దాల్చటం లేదు. సెల్‌ఫోన్లు సైతం సరిగ్గా పనిచేయటం లేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి సిగ్నల్ సామర్థ్యాన్ని పెంచాలని కోరుతున్నారు.మాది కరకగూడెం మండలం రేగళ్ల. ఇక్కడ సిగ్నల్ సరిగ్గా లేకపోవటంతో అంతర్జాల సేవలందించటానికి ఎవరూ ముందుకు రావటం లేదు. ముఖ్యంగా బ్యాంకు సేవలు పొందాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. సిగ్నల్ సామర్థ్యం మెరుగుపడితే బ్యాంకులు వినియోగదారుల



సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తామంటున్నాయి.

- కుంజ వసంతరావు, మాజీ సర్పంచి, రేగళ్ల

జిల్లాలో సిగ్నల్ అందని ప్రాంతాలను గుర్తించాం. ఆయాచోట్ల బ్యాంకు సేవలు అందించటానికి వినియోగదారుల సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలని బ్యాంకులకు సూచించాం. సిగ్నల్ సమస్య కారణంగా వాటి ఏర్పాటు సాధ్యం కావటం లేదు. సమస్య పరిష్కారం కాగానే ప్రజలకు బ్యాంకు సేవలను సులభతరం చేస్తాం.

- రాంరెడ్డి, లీడ్‌బ్యాంక్ మేనేజర్

**బ్యాంకులున్న చోట అదేతీరు**

కొన్నిచోట్ల టవర్లు ఏర్పాటుచేసినా వాటినుంచి కావాల్సినంత సిగ్నల్స్ అందటం లేదు. సిగ్నల్‌లో హెచ్చుతగ్గులుంటే బ్యాంకు సేవలందించటం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. గుండాల మండలం కాంచనపల్లి ఎస్‌బీఐ, ఆళ్లపల్లిలోని యూబీఐలో సిగ్నల్ సమస్య కారణంగా సేవల్లో జాప్యం జరుగుతోంది. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోంది.

# పారిశుద్ధ్యం.. పట్టని వైనం

సిరిసిల్ల : పట్టణాల్లో స్వచ్ఛత పాటించి ప్రజలకు ఆరోగ్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం లక్షలు ఖర్చు చేస్తోంది. వివిధ పద్ధతులతో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినా పుర అధికారుల నిర్లక్ష్యంతో ఫలితం కాస్తా మురుగు నీటిలో కలిసేలా తయారైంది. సిరిసిల్ల పట్టణంలోని శివారు కాలనీల్లో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారింది. కాల్వలు లేక మురుగు నీరంతా ఇళ్ల మధ్య నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి నిల్వలతో దోమల తీవ్రత పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక పారిశుద్ధ్య పనులు గాడి తప్పుతున్నాయి.

**చెరువులా ఖాళీ స్థలాలు...**

పట్టణంలో చాలా వార్డులలో మురుగు కాల్వలు లేక ఇళ్ల ముందే ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిండి చెరువులా మారుతున్నాయి. సిరిసిల్ల పట్టణ పరిధిలోని చంద్రపేట, జ్యోతినగర్, కొత్తబస్టాండ్, శాంతినగర్, శివనగర్, రాజీవ్‌నగర్, ముష్టిపల్లి తదితర కాలనీల్లో పరిస్థితి



అధ్వాన్నంగా తయారైంది. అక్కడ సీసీ రోడ్లు నిర్మించారు కానీ మురుగు కాల్వల నిర్మాణం చేపట్టక పోవడంతో కాలనీల్లో ఇంటికో మురుగు కాల్వ దర్శనమిస్తున్నాయి. దోమల తీవ్రతతో అక్కడి వారు జ్వరాల బారిన పడుతున్నారు. దోమల నివారణకు ఫాగింగ్, దోమల మందు పిచికారీ చేయకపోవడం అధికారుల పర్యవేక్షణకు అద్దం పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నిల్వకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం..**

శివారు కాలనీలు, విలీన గ్రామాలతో పాటు సిరిసిల్ల పట్టణంలో రెండు రోజుల్లో పారిశుద్ధ్య పనుల పూర్తికి చర్యలు తీసుకుంటాం. చేనేత, జౌళిశాఖ కార్యాలయం ముందు బ్లీచింగ్ పౌడర్ చల్లి మురుగు లేకుండా చూస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలతో దోమల మందు పిచికారీ చేయిస్తాం.సత్యనారాయణ, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్

# గట్లు తెంచి.. గరళం నింపి

హైదరాబాద్ : రాజధాని పరిధిలో చెరువుల తీరు మారడం లేదు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చెరువుల ఆక్రమణ, కలుషితంపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నా ఫలితం కన్పించడం లేదు. కొన్ని చెరువుల్లో భారీ నిర్మాణాలు వెలిసినట్లు విచారణలో తేలింది. హైకోర్టు ఆదేశాల మేరకు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 13 చెరువులను అడ్వొకేట్ కమిషన్ ఇటీవల ప్రత్యక్ష పరిశీలన చేస్తే పరిస్థితి ఎంత దారుణంగా విధితమైంది. దీనిపై బల్దియా, హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారులు అక్రమ నిర్మాణాలకు పరోక్షంగా తోడ్పాటు ఇస్తున్నట్లు వెలుగులోకి వస్తోంది.

**ఇంత దారుణమా!**

హైదరాబాద్ జిల్లాలో 185 చెరువులుంటే హెచ్ఎండీఏ పరిధిలో 4500 వరకు చెరువులున్నాయి. నగరంలోని చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోకపోవడంపై 2007లో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారించిన ధర్మాసనం ఇటీవల తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం



చేసి నివేదిక సమర్పించాలని డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, టి.శ్రీకాంత్‌రెడ్డిలతో అడ్వొకేట్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిటీ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని 13 చెరువులను సందర్శించి ఇటీవల నివేదిక సమర్పించింది. ఆయా చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని, చెత్తాచెదారం, మురుగుతో నిండాయని కమిషన్ నిర్ధారించింది. చెరువుల్లోని మురుగునీటితో పండించిన ఆకుకూరలు, కూరగాయలు, చేపలు తింటే ప్రజల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం ఉంటుందని పేర్కొంది. చెరువులు, కాలుష్యం, ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు తదితర కేసుల సత్వర పరిష్కారానికి హైకోర్టు పరిధిలో గ్రీన్ బెంచ్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను సూచించింది. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ శాస్త్రీయంగా నిర్వహించి తుది నోటిఫికేషన్ జారీ చేయాలని కమిషన్ కోరింది. ఆక్రమణదారులపై చర్యలు తీసుకునేలా ఇరిగేషన్ శాఖకు తగిన అధికారాలు కల్పించాలని, ఉమ్మడిగా కృషి చేస్తేనే చెరువుల పరిరక్షణ సాధ్యమని వెల్లడించింది.

# ముందు ఫీడర్లు.. ఆ తర్వాత ట్రాన్స్‌ఫార్మర్లు

హైదరాబాద్: మాసబ్‌ట్యాంక్ సెక్షన్‌లో ఇటీవల ఓ ట్రాన్స్‌ఫార్మర్ పాడవడంతో ఆరేడు గంటలు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన లేక.. ఎక్కువ గంటలు శ్రమించారు. కార్యాలయంలో ఉండే పైఅధికారులకు క్షేత్రస్థాయిలో రియల్‌టైమ్‌లో అంతరాయాలు తెలిసే వ్యవస్థ లేకపోవడం ప్రధాన లోపంగా ఉంది.

ఉన్నతాధికారులకు సమాచారం లేదు.. సిటీలో సరఫరాకు సంబంధించి ఫీడర్లలో, ట్రాన్స్‌ఫార్మర్లలో గంటలపాటు అంతరాయం ఏర్పడినా ఉన్నతాధికారులకు సమాచారం ఉండటం లేదు. గతంలో ఫీడర్ల స్థాయిలో ఆటోమేషన్ చేసినా అవి ప్రధాన నగరంలో 1100 ఫీడర్ల వరకే పరిమితమయ్యాయి. సిటీలో దీనికి మూడు రెట్లు ఫీడర్లు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల(డీటీఆర్) సంఖ్య లక్షల్లోనే ఉంది. వీటి సరఫరా నిల్చిపోతే పైఅధికారులకు తెలిసే వ్యవస్థ లేదు. ఇదే పర్యవేక్షణకు లోపంగా ఉంది.

విస్తరించని సాంకేతికత.. 226 విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని 1100 ఫీడర్లలో ఆటోమేషన్ చేపట్టి స్కాడాతో అనుసంధానం ఎప్పుడో చేపట్టారు. ఆఫీస్ నుంచి ఉన్నతాధికారులు ఫీడర్ల బ్రేక్‌డౌన్లను తెలుసుకునే వ్యవస్థను తీర్చిదిద్దారు. మిగతా ఉపకేంద్రాలకు విస్తరించాలనే ప్రణాళికలు ఉన్నా.. గతంలో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు.

ట్రాన్స్‌ఫార్మర్ స్థాయిలో ఉంటేనే.. ఇతర నగరాల్లోని డిస్కంల్లో ఆటోమేషన్ ట్రాన్స్‌ఫార్మర్ స్థాయిలో ఉన్నట్లు ఇటీవల అధ్యయనానికి వెళ్లిన అధికారుల బృందాలు గుర్తించాయి. ఫీడర్లకు సెన్సర్లు ఏర్పాటు చేసి ఆటోమేషన్ చేశాక, ట్రాన్స్‌ఫార్మర్లపై దృష్టి సారించే అవకాశముందని సమాచారం.

# చెరువుల రక్షణకు చర్యలు

కరీంనగర్ : కరీంనగర్ నగర పరిధిలో ఎగువ ప్రాంతాల్లోంచి వరదంతా చెరువుల్లోకి వెళ్లేది. పాతికేళ్ల కిందటనే ఆ చెరువులను మాయం చేశారు. తీరా ఒకట్రెండు ప్రాంతాల్లో ముసురు వర్షాలకు రహదారులు జలమయమవుతున్నాయి. దీనికి కారణాలు అన్వేషిస్తే తటాకాలు లేకపోవడమేనని అధికారులు, పాలకులు గుర్తించారు.
కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని విలీన కాలనీల్లో చెరువులు ఉన్నాయి. నగరానికి ఆనుకొని ఉండటంతో ఆక్రమణలకు గురవుతున్నాయి. గతంలోనే కొంతమేర కబ్జాలకు గురయ్యాయి. పలు ప్రాంతాల్లోని చెరువు హద్దులు మారిపోయాయి. కుంటలు, చెరువులు కనిపించకుండా పోతే భవిష్యత్తులో నగరం పరిస్థితి ఏమిటనేది తెలియడంలేదు. ప్రస్తుతమున్న వాటిని కాపాడుకోవడానికి అధికారులు ముందుకు వెళ్తున్నా అడ్డంకులు తప్పడం లేదు. నాలుగేళ్ల కిందట అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, నీటిపారుదల, పట్టణ ప్రణాళిక అధికారులతో బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం విలీన కాలనీల్లో శిఖం భూములు, చెరువుల హద్దులు నిర్ణయించేందుకు సర్వే ప్రారంభించి వదిలేసింది. నగర పాలిక తరఫున చెరువుల రక్షణకు హద్దురాళ్లను ఏర్పాటు చేసేందుకు టెండర్లు సైతం పిలిచారు. ఒకటెండ్రు చెరువులకు రాళ్లను ఏర్పాటు చేయగా అందుల్లోకి నీరు అధికంగా ఉందని పేర్కొంటూ వదిలేశారు. ఇలా అయిదేళ్లుగా వాటిని




అధికారులు పట్టించుకోవడమే మానేశారు.
ఆదేశాలు జారీ..ఇటీవల మూడు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి చెరువుల పరిరక్షణకు చర్యలకు ఆదేశాలు జారీ చేశాం. హద్దులు ఖరారు చేయడంతోపాటు బయో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించాం. – బి.శ్రీనివాస్, కమిషనర్, కరీంనగర్ నగరపాలిక
బృందాల ఏర్పాటు..చెరువులు, కుంటలు, నాలాల రక్షణకు సమగ్ర సర్వే చేయాలని నగర పాలక కమిషనర్ ఇటీవల ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు. నీటి పారుదల శాఖ, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక అధికారులతో బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా హద్దులు ఏర్పాటు చేయడంతోపాటు ఆ ప్రాంతంలో వాకింగ్‌ట్రాక్, ఓపెన్‌జిమ్‌లు, నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవడం, చెరువుల చుట్టూ మొక్కలు నాటించడం ప్రణాళికలు చేయనున్నారు.
ముందుగా హద్దుల గుర్తింపు నగర శివారు ప్రాంతాల్లో ఉన్న చెరువులు, శిఖం భూములు క్రమేనా ఆక్రమణకు గురవుతున్నాయి. ఇప్పటికే ఆక్రమించిన చోట న్యాయపరంగా వివాదాల్లో ఉన్నాయి. ఓ ప్రాంతంలో అయితే పూర్తి స్థలం ఆక్రమించారు. అత్యధికంగా పొలాల మధ్యన ఉన్నాయి. పొలాల గట్లు పొడిగించకుండా కొలతలు చేస్తే ఎంతమేర కబ్జాకు గురైందనే విషయం బయటకు వస్తోంది. ఆ లెక్కన హద్దులు ఏర్పాటు చేస్తే ప్రయోజన్న ఉంటుంది. అంతేకాకుండా ఎక్కడైతే చెరువులు, కుంటలు ఉంటాయో అక్కడ చెరువు విస్తీర్ణం ఎంతమేర ఉందో పేర్కొంటూ బోర్డు ఏర్పాటు చేస్తే ప్రజలందరూ తెలుసుకొని ఆ స్థలాన్ని రక్షించుకుంటారు.

## ఈసారీ ఉపాధ్యాయుల కొరతే!

పెద్దపల్లి : మరికొద్ది రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. గతేడాదిలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు ఉత్తీర్ణతపై ప్రభావం చూపింది. కొన్ని చోట్ల సర్దుబాటు చేసినప్పటికీ పెద్దగా ఫలితం లేకుండా పోయింది. అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం మూతబడిన బడులను తెరిపించేందుకు క్షేత్ర స్థాయిలో జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది. బడుల ప్రారంభంనాటికి ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం ప్రత్యామ్నాయంగా విద్యా వాలంటీర్లను నియమిస్తామని స్పష్టం చేసింది. కానీ ఇప్పటివరకు దీనిపై ఎలాంటి ముందడుగు పడలేదు. బోధన కష్టాలు తీరుతాయనుకున్న విద్యార్థులకు నిరాశ తప్పేలా లేదు. కొవిడ్ అనంతరం విద్యావాలంటీర్ల నియామక ప్రక్రియ నిలిపివేయగా.. ప్రస్తుతం నూతనం ప్రభుత్వ ఆదేశాలతో విద్యావాలంటీర్లను నియమిస్తారా? లేదా? అనే సందిగ్ధం నెలకొంది.
823 ఖాళీలు ఉమ్మడి జిల్లాలో 2,560 ప్రభుత్వ పాఠశాలల్లో 1,55,935 విద్యార్థులు చదువుతున్నారు. 9,952 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. పలు పాఠశాలల్లో ఖాళీల కొరత వెక్కిరిస్తోంది. జగిత్యాల 334, కరీంనగర్ 245, పెద్దపల్లి 93, రాజన్నసిరిసిల్ల 151 చొప్పున సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయుల కొరత ఉంది. కొన్ని చోట్ల గ్రామస్తులు, దాతల సహకారంతో విద్యావాలంటీర్లతో కాలం వెళ్లదీస్తున్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. సదరు ఉపాధ్యాయుడు రాని రోజు ఆ పాఠశాల విద్యార్థులకు సెలవే.
నాలుగేళ్ల తర్వాత తెరపైకి
గతంలో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు అర్హత ఉన్న వారిని విద్యా వాలంటీర్లుగా నియమించారు. ఉమ్మడి జిల్లాలో 753 మంది పని చేశారు. 2019–20 విద్యా సంవత్సరంలో కొవిడ్ తర్వాత నుంచి ఇప్పటి వరకు ఈ ప్రక్రియను నిలిపి వేశారు. గత ప్రభుత్వం ఉన్న ఉపాధ్యాయులతోనే సర్దుబాటు చేసింది. కొత్త ప్రభుత్వం మళ్లీ విద్యా వాలంటీర్లను నియమిస్తామని ప్రకటించడంతో వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. పాఠశాలల్లో ఖాళీల కొరత కూడా తీరనుంది.
ఎలాంటి ఆదేశాలు రాలేదుప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వాలంటీర్లను నియమించాలని సర్కారు నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రత్యామ్నాయంగా బోధనలో ఇబ్బందులు లేకుండా ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నాం. ఇప్పటి వరకు అవసరమైన వాలంటీర్ల వివరాల జాబితా నివేదించలేదు. – మాధవి, జిల్లా విద్యాధికారి, పెద్దపల్లి ఓ చోట తక్కువ.. మరో చోట ఎక్కువసర్కారు బడుల్లో కొన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి. ప్రత్యామ్నాయంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినప్పటికి ఉత్తీర్ణత శాతం తగ్గుతోంది. విద్యార్థులు ఎక్కువ ఉన్న పాఠశాలల్లో ఒక్కో సబ్జెక్టుకు రెండు పోస్టులు అవసరం ఉండగా ఒక్కరితోనే నెట్టుకొస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల ఉన్నత పాఠశాలలో తొమ్మిది మందికి ఆరుగురు ఉపాధ్యాయులు, మానకొండూర్ మండలం దేవపల్లి ఉన్నత పాఠశాలలో 13 మంది విద్యార్థులు ఉండగా 8 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు.

# బోసినవ్వుల బాల్యం.. అమ్మకానికి బేరం



హైదరాబాద్: తల్లి పొత్తిళ్లలో సేదతీరాల్సిన పసికందుల్ని వస్తువులా అమ్మకానికి పెడుతున్నారు. చైల్డ్‌లైన్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, పోలీసులు నిరంతరం తనిఖీలు, ప్రత్యేక కార్యక్రమాలతో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నా.. చిన్నారుల్ని దొడ్డిదారిలో విక్రయించే ముఠాలు యథేచ్ఛగా తమ పనిచేసుకుంటూ వెళ్తున్నాయి. ఆడపిల్ల పుట్టిందని, పిల్లలు అనారోగ్యంతో ఉన్నారని.. పోషణ భారం భరించలేమని భావించే తల్లిదండ్రులే లక్ష్యంగా కొన్ని ముఠాలు చెలరేగుతున్నాయి. ఆడపిల్లకు, అబ్బాయికి వేర్వేరు ధరలు నిర్ణయించి అమ్మేస్తున్నారు. తాజాగా మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు నెలల పసికందును విక్రయిస్తూ ముగ్గురు మధ్యవర్తులు పట్టుబడడం కలకలం రేపింది. ఇలా ఏటా వందలాది మంది చిన్నారుల్ని గుట్టుచప్పుడు కాకుండా బేరసారాలాడి అమ్మేస్తున్నట్లు అధికారులే అంగీకరిస్తున్నారు.
ఆసుపత్రుల దగ్గరే దందా..
ప్రధానంగా ఆసుపత్రులు, కొందరు దారి తప్పిన వైద్యులు కేంద్రంగా చిన్నారుల అమ్మకాలు జరుగుతున్నాయి. నగరంలోని పేట్లబుర్జు, నిలోఫర్ సహా కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల దగ్గర తిష్ఠ వేస్తున్న కొందరు కేటుగాళ్లు.. బేరసారాలకు తెరతీస్తున్నారు. ఏటా వేలాది మంది కాన్పులు, రోజుల వయసున్న చిన్నారులకు చికిత్స కోసం నగరంలోని ఆసుపత్రులకు వస్తుంటారు. వీరిలో కొందరు మూడు, నాలుగు కాన్పులైనా ఆడపిల్ల పుట్టిందని, ఒకేసారి ఇద్దరు ఆడపిల్లలు పుట్టారని, అనారోగ్యంతో ఉన్న చిన్నారి పోషణభారం భరించలేమంటూ అక్కడే తోటివారితో మనోగతాన్ని పంచుకుంటుంటారు. ఇలాంటి వారిని లక్ష్యంగా చేసుకునే కొందరు ఇతరులకు అమ్మేస్తామనో లేక దత్తత ఇప్పిస్తామనో నమ్మిస్తున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో కొందరు ప్రసూతి సేవలందించే సిబ్బంది ఈ తరహా అక్రమాలకు పాల్పడుతున్నారు. తాజాగా మేడిపల్లిలో ఉదంతంలో ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ నిర్వహించే మహిళ దళారీ పాత్ర పోషించి చిన్నారిని అమ్మేందుకు ప్రయత్నించడం ఓ ఉదాహరణ.
దత్తతకు ఆలస్యం
పిల్లలున్న నిరుపేదలు పోషణభారం ఇతర సమస్యలతో విక్రయిస్తున్నారు. మరోవైపు సంతానలేమి సమస్య ఉన్న దంపతులు దత్తత పేరుతో చట్టవిరుద్ధంగా చిన్నారుల్ని కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలాంటివి అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) పేరుతో చర్యలు తీసుకుంటోంది. చిన్నారుల దత్తత కోసం దరఖాస్తు చేసినా ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి రావడంతో అడ్డదారిలో కొనుగోలుకు ప్రయత్నిస్తున్నారు. నగరంలోని శిశు విహార్‌లోని చిన్నారుల దత్తత కోసం 2050 మంది దరఖాస్తు చేసుకోగా... అక్కడున్నది 186 మంది శిశువులు మాత్రమే. చిన్నారి దత్తత కోసం సగటున 3-4 ఏళ్ల సమయం పడుతోంది. భారీ పోటీ వల్ల ఎక్కువ మంది ఆసుపత్రులు, వివిధ ప్రాంతాల్లో దళారులను సంప్రదిస్తుంటారు. చైల్డ్‌లైన్, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం(ఏహెచ్‌టీయూ) తరచూ ప్రత్యేక ఆపరేషన్లతో నిఘా పెడుతున్నా పరిమితంగా ఉంది.
గతేడాది ఆపరేషన్ ముస్కాన్ గణాంకాలు
కాపాడిన చిన్నారులు 2617
ఇందులో బాల కార్మికులు 1531
యాచకులుగా మారిన వారు 109

# వాయువేగం.. జనం ఆగం



పరిగి : హయత్‌నగర్, కుంట్లూరు, వనస్థలిపురం, ఎల్బీనగర్ ప్రాంతాల్లో గాలివాన దెబ్బకు యాభైకి పైగా చెట్లు కూలిపోయాయి. నాలుగైదు కార్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి.
వనస్థలిపురంలో సాగర్‌రింగ్‌రోడ్డు, బీఎన్‌రెడ్డినగర్, తుర్కయాంజాల్ ప్రాంతాల్లో అరగంటసేపు ఏకధాటిగా వర్షం కురిసింది.
నిజాంపేట బృందావన్‌కాలనీ, హైదర్‌నగర్‌లో టిఫిన్‌సెంటర్లు, చెరుకురసం బండ్లపై రేకులు, టార్పాలిన్‌లు ఎగిరిపోయాయి.
హిమాయత్‌నగర్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్‌మ్యాట్ షెడ్ గాలికి ఎగిరింది. పరదాకు ఉన్న ఇనుప గొట్టాలు ఆర్టీసీబస్సు, ఇన్నోవాకారుపై పడ్డాయి. హయత్‌నగర్‌లోని ఆర్టీసీ డిపోలో బస్సుపై భారీ చెట్టుపడింది.
జనం సేద తీరుతుంటే.. ఒక్కసారిగా భయంగొలిపే గాలివాన శివారు ప్రజలను వణికించింది. కేవలం రెండు గంటల్లో హోరుగాలి... భారీవర్షం భయోత్పాతాన్ని సృష్టించింది. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు భారీవృక్షాలు ఒక్కసారిగా నేలకొరిగాయి.. కార్లు, బైకులు వాటికింద నలిగిపోయాయి. విద్యుత్తు తీగలపై పడడంతో కరెంటు సరఫరా గంటల తరబడి నిలిచిపోయింది. శివారు ప్రాంతాల్లో వందకుపైగా కాలనీల్లో అంధకారం నెలకొంది. అర్ధరాత్రి దాటినా చాలా ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా పునరుద్ధరించలేదు. ఎల్బీనగర్, కూకట్‌పల్లి, మియాపూర్, గచ్చిబౌలి, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా వనస్థలిపురంలో 1.3 సెంటీమీటర్ల వర్షం కురవగా.. మియాపూర్‌లో 0.8సెం.మీ, గచ్చిబౌలిలో 0.5 సెం.మీ వాన కురిసింది.
గాలిలో కలిసిన నాలుగు ప్రాణాలు
గాలివాన బీభత్సానికి చెట్లకొమ్మలు, ఇటుక రాళ్లు మీద పడి వేర్వేరుచోట్ల నలుగురు మృతి చెందారు. చెట్లకొమ్మలు మీదపడి.. యాదాద్రి జిల్లా బొమ్మలరామారానికి చెందిన నాగిరెడ్డి రాంరెడ్డి(60) ఎరువుల దుకాణం నడుపుతున్నారు. సమీపంలోని ధర్మారంలో కోళ్ల ఫారం నిర్వహిస్తున్న దేశినేని ధనుంజయ్(44)తో అతనికి పరిచయం ఉంది. దుకాణానికి వచ్చిన ధనుంజయ్‌ను వెంట తీసుకొని శామీర్‌పేట మండలం తూంకుంటలో తన బంధువులకు మామిడి పండ్లు ఇచ్చేందుకు ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. తిమ్మాయిపల్లి వద్దకు రాగానే ఈదురు గాలులతో వర్షం మొదలైంది. ఆగకుండా అలాగే వెళ్తుండటంతో ఒక్కసారిగా రోడ్డు పక్కనున్న చెట్టు కొమ్మ విరిగి వీరిపై పడింది. ధనుంజయ్ ఛాతికి చెట్టు కొమ్మ వచ్చి బలంగా తగిలింది. వెనకున్న రాంరెడ్డి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే చనిపోయారు.తీవ్ర గాయాలతోనే ధనుంజయ్.. రాంరెడ్డి కుటుంబసభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. ఆ తర్వాత ధనుంజయ్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.
ఇటుక రాళ్లు ఎగిరొచ్చి.. హఫీజ్‌పేట సాయినగర్‌లో నసీముద్దీన్ కుటుంబం ఉంటుంది. ఆదివారం సాయంత్రం ఈదురుగాలులకు ఇంట్లో నిద్రిస్తున్న ఆయన కుమారుడు సమద్(4)పై ఇటుక రాయి పడడంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.
అదే సమయంలో సాయినగర్ పక్కనే ఉన్న యూత్ కాలనీలో మెడికల్ షాప్ నిర్వహించే రషీద్(45) తన చిన్న కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్నాడు. సమీపంలోని ఓ ఇంటి రేకుపై ఉన్న ఇటుక రాళ్లు ఎగిరిపడడంతో ఆయన తలకు తీవ్ర గాయమైంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.
జీహెచ్ఎంసీకి ఫిర్యాదులు నగరంలో వర్షానికి పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. ఈ సందర్భంగా పలువురి నుంచి జీహెచ్ఎంసీకి ఫిర్యాదులు అందాయి. కూలిపోయిన చెట్లకు సంబంధించి 48 ఫిర్యాదులు రాగా డీఆర్ఎఫ్ బృందాలు వాటిలో 42 అంశాలను పరిష్కరించారు. రహదారులపై గుంతల పూడ్చివేతకు సంబంధించి వచ్చిన 5 ఫిర్యాదులను పరిష్కరించారు.

# ఎరువుల నిల్వలపై నిఘా

నల్గొండ : జిల్లాలో మరికొద్ది రోజుల్లో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే అవకాశముంది. ఎరువుల కొరత ఏర్పడుతుందేమోనని ఎక్కువ మొత్తంలో సాగు చేసే రైతులు పంటలకు కావాల్సిన ఎరువులను ముందస్తుగా కొనుగోలు చేసి నిల్వ చేసుకునే అవకాశం ఉంది. ఎరువుల నిల్వలు తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ కార్యాచరణ చేపట్టింది. ఇందుకు ప్రత్యేకంగా ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం (ఎఫ్ఐవీఈఎస్) యాప్‌ను అందుబాటులోని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు జిల్లాలోని అన్నీ దుకాణాల్లో తరచూ తనిఖీలు చేస్తూ యాప్‌లో సంబంధిత వివరాలు నమోదు చేస్తున్నారు.అవసరాలకు అనుగుణంగా సరఫరా
సీజన్‌లో యూరియా, తదితర రసాయన ఎరువుల కొరత ఏర్పడి రైతులు నానా అవస్థలు పడుతుంటారు. రైతులకు ఇబ్బందులు తొలగించేందుకు రైతుల డిమాండ్ అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పంపిణీ పక్కాగా ఉండేందుకు ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం (ఎఫ్ఐవీఈఎస్) యాప్‌ను వినియోగిస్తున్నారు. కృత్రిమ కొరత సృష్టించకుండా పారదర్శకంగా రైతులకు ఎరువులు అందించేందుకు ఇది ఉపయోగపడుతుంది. పీవోఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) యంత్రాల ద్వారా విక్రయించాలని నిబంధనలు ఉన్నా, కొందరు డీలర్లు విస్మరిస్తున్నారు. దీన్ని నిరోధించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, సహాయ సంచాలకులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిల్వలను యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి. జియోట్యాగింగ్ అనుసంధానం చేశారు.ప్రతి వారంలో మండల వ్యవసాయ అధికారులు, సహాయ సంచాలకులు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పలు ఎరువుల దుకాణాలు తనిఖీ చేయాలి.

# కోతల కాన్పులే!

భువనగిరి : జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో విచ్చలవిడిగా శస్త్రచికిత్సల (సిజేరియన్) కాన్పులు చేస్తున్నారు. ప్రతి పది మంది గర్భిణుల్లో ఎనిమిది మందికి ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టిసారించింది. కోతలు ఎక్కువగా అవుతున్న ఆసుపత్రులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపింది. ఏప్రిల్ మాసంలో ఎక్కువ శస్త్రచికిత్సలు చేసిన ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోంలలో గణాంకాలను పరిగణనలోకి తీసుకొని మాతా, శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం తనిఖీలు చేపట్టింది. భువనగిరిలో ఇప్పటికే ఆరు ప్రైవేటు ఆసుపత్రుల్లో సోదాలు జరిపింది. చౌటుప్పల్‌లో గుర్తించిన దవాఖానాల్లో దస్త్రాలను పరిశీలించి స్వాధీనం చేసుకుంది. సరైన కారణాలు లేకుండా కాన్పులు చేసిన ఆయా ఆసుపత్రులకు శ్రీముఖాలు జారీ చేసింది. చౌటుప్పల్, రామన్నపేట, వలిగొండ, ఆలేరులో మరో 25 ఆసుపత్రులు, నర్సింగ్ హోంలలో ఇదే పరిస్థితి నెలకొందని అధికారులు గుర్తించారు.
కారణం లేకుండా..
సిజేరియన్ల వివరాలు, దస్త్రాలు, కేస్‌షీట్లు, స్కానింగ్ రిపోర్టులను పరిశీలిస్తున్నారు. ఒక్కో ఆసుపత్రిలో చేసిన కాన్పుల్లో 90 శాతానికి పైగా శస్త్రచికిత్సలే ఉంటున్నాయి. వాటిపై సరైన కారణం లేకపోవడంతో ప్రత్యేక నివేదిక సిద్ధం చేస్తున్నారు. భువనగిరిలోని ఆరు దవాఖానాల్లో తనిఖీ బృందం ప్రసవాల దస్త్రాలను స్వాధీనం చేసుకుంది. గర్భిణులకు మొదటగా సహజ ప్రసవం చేసేందుకు ప్రయత్నం చేయాలి. వీలు కాకుంటే సిజేరియన్ చేయాలి. అలా కాకుండా కొందరు ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు ధనార్జనే లక్ష్యంగా కోతలతో ప్రసవాలు చేస్తున్నారు. మరికొన్ని కేసుల్లో గర్భిణులు పురిటి నొప్పులు భరించలేక శస్త్రచికిత్స వైపు మొగ్గు చూపుతున్నట్లు తనిఖీల్లో తేలింది. ఉమ్మనీరు తక్కువగా ఉన్న సమయంలో, కవల పిల్లలు, గర్భంలో పిండం అడ్డం తిరగడం, మాయ తక్కువ ఉన్న సమయంలోనే సిజేరియన్లకు మొదటగా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఈ కారణాలు లేకుండానే ఎక్కువ మంది వైద్యులు పొట్టను కోసి బిడ్డను తీస్తున్నారు.
ఎడాపెడా శస్త్రచికిత్సలు
ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్య పెరుగుతున్నా, ప్రైవేటు ఆసుపత్రుల్లో మాత్రం పెద్దగా మార్పులేదు.
జిల్లాలో పట్టణాలు, మండల కేంద్రాల్లో ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్‌హోంలో సుమారు రోజుకు 40 వరకు ప్రసవాలు చేస్తున్నారు. 2022లో 10,500 కాన్పులు చేయగా అందులో 85 శాతానికి పైగా సిజేరియన్లు ఉన్నాయి. 2023లో ప్రైవేటు ఆసుపత్రుల్లో 8,734 కాన్పులు చేశారు. అందులో 1100 మాత్రమే సాధారణం కాగా 7,634 శస్త్ర చికిత్సలు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు ప్రైవేటు ఆసుపత్రుల్లో కేవలం 89 సహజ ప్రసవాలు చేయగా 689 సి-సెక్షన్ చేశారు.

# పల్లెపాలన.. ఆగమాగం

భువనగిరి : సర్పంచుల పదవీ కాలం ముగిసి.. అధికారుల పాలన మొదలై నాలుగు నెలలవుతోంది. నిధుల లేమికి తోడు, తమకున్న శాఖాపరమైన విధులే కాకుండా గ్రామాల ప్రత్యేకాధికారుల అదనపు బాధ్యతలున్నందున సదరు అధికారులు నామమాత్రంగానే పల్లెల ముఖం చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షణ కొరవడిన ఫలితంగా స్థానికంగా పంచాయతీ కార్యదర్శులపైనే భారం పడుతుండటంతో పలు అభివృద్ధి పనులు, మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టడం లేదని తెలుస్తోంది. ప్రత్యేకాధికారుల పాలనకు ముందే పంచాయతీ ఖాతాలు ఖాళీ అయ్యాయన్నది వాస్తవం. ముఖ్యంగా సర్కారు నుంచి కొన్ని నెలలుగా నిధులు జమ కాకపోవడంతో పాలన మొక్కుబడిగా సాగుతోంది. ఇందు కారణంగా పంచాయతీల్లో పారిశుద్ధ్యం చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. ఒక్కో ప్రత్యేకాధికారికి రెండు కంటే ఎక్కువ పంచాయతీల బాధ్యతలు అప్పగించడంతో సమస్యలు పరిష్కారం దిశగా ముందుకు సాగడం లేదంటున్నారు. గతంలో చేపట్టిన పలు పనులకే నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో అభివృద్ధిపై ప్రభావం చూపుతోందని స్థానికులంటున్నారు. రానున్న వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడకపోతే ప్రజలు జబ్బుల బారిన పడే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
మాతృశాఖ విధులకే అధిక ప్రాధాన్యం..
ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 1,740 పంచాయతీల్లో గత ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఇందుకు మండల, డివిజన్ స్థాయిలోని గెజిటెడ్ ఉద్యోగులకు రెండు కంటే ఎక్కువ



పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. మిషన్ భగీరథ, నీటిపారుదల శాఖల అధికారులు మాతృశాఖకే పరిమితమవుతున్నారనే ఆరోపణలున్నాయి. వేసవిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నందున గ్రామాల్లో నీటి సమస్య ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునే నేపథ్యంలో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై మల్లగుల్లాలు పడుతున్నారు. గ్రామాల ప్రత్యేకాధికారులు వారంలో కనీసం రెండు పర్యాయాలు కూడా గ్రామాలకు వెళ్లడం లేదనే విమర్శలున్నాయి. ఫలితంగా స్థానికంగా పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు, ఎంపీడీవోలపై అదనపు భారం పడుతుందనే వాదన ఉంది. ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, పైపుల లీకేజీకి మరమ్మతు, బోర్ల మరమ్మతు పనులు పంచాయతీ ట్రాక్టర్ నెలవారీ బ్యాంకు వాయిదా, గ్రామాల్లో విద్యుత్తు దీపాలు, నెలనెలా విద్యుత్తు బకాయిలు.. ఇవన్నీ కచ్చితంగా చెల్లించాల్సిందే. నిధుల లేమి కారణంగా ఈ బరువు బాధ్యతల గురించి ప్రత్యేక అధికారులు అంటీముట్టనట్లుగా ఉండటంతో గ్రామ కార్యదర్శులే ఎలాగోలా కార్మికులకు జీతాలు సర్దుబాటు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఒక్కో గ్రామ పంచాయతీ రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అప్పుచేసి ఖర్చు చేసినట్లుగా తెలుస్తోంది. పంచాయతీల ప్రత్యేకాధికారుల ఖర్చుల విషయంలో చేతులెత్తేస్తుండటంతో భారమంతా కార్యదర్శులపైనే పడుతోంది. నాలుగు రోజులు ఉండి పోయే వాళ్లమని ప్రత్యేకాధికారులు దాట వేస్తున్నారనే వాదన వినిపిస్తోంది.




## ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రమాదం.. పట్టాలు తప్పిన పలు బోగీలు

ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లాలో చండీగఢ్-డిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. గురువారం మధ్యాహ్నం 2.35 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులు మృతిచెందగా.. దాదాపు 20 మందికి పైగా గాయపడినట్లు యూపీ ఉపముఖ్యమంత్రి బ్రజేశ్ పాథక్ తెలిపారు. ఈ రైలు బుధవారం రాత్రి చండీగఢ్ స్టేషన్ నుంచి అస్సాంలోని డిబ్రూగఢ్‌కు బయల్దేరింది. గురువారం మధ్యాహ్నం యూపీలోని ఝులాహి రైల్వే స్టేషన్‌కు కొన్ని కిలోమీటర్ల దూరంలో ప్రమాదానికి గురైంది. నాలుగు ఏసీ బోగీలు సహా 12 బోగీలు పట్టాలు తప్పాయి. ఒక పక్కకు ఒరిగిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారమందుకున్న స్థానిక పోలీసులు, అధికారులు వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

15 అంబులెన్స్‌లు, మెడికల్ బృందాన్ని సిద్ధంగా ఉంచారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదం గురించి తెలియగానే యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంబంధిత యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అటు అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ కూడా దీనిపై స్పందించారు. పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదం కారణంగా ఈ మార్గంలో ఇతర రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కనీసం 13 రైళ్లను దారి మళ్లించినట్లు రైల్వే శాఖ అధికారులు వెల్లడించారు. కొన్ని రైళ్లను రద్దు చేశారు.




## జేసీ ఇంటికి వచ్చిన లాయర్ శ్రీనివాసులు.. పొమ్మన్న ప్రభాకర్ రెడ్డి!

వైకాపా అధికారంలో ఉన్నప్పుడు తాడిపత్రికి చెందిన ఓ లాయర్ నోరు పారేసుకున్నాడు. జేసీ ప్రభాకర్ రెడ్డి సహా తెలుగుదేశం నేతలపై తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. సీన్ కట్ చేస్తే.. తెలుగుదేశం అధికారంలోకి రావడంతో తిరుగుటపాలో వచ్చేశాడు. మళ్లీ పార్టీలో చేరతానంటూ జేసీని ప్రాధేయపడ్డాడు. పార్టీలో చేర్చుకోవడం కుదరదని చెప్పినా వినకపోవడంతో.. జేసీ అనుచరులు సదరు లాయర్‌ను ఇంట్లో నుంచి ఎత్తుకెళ్లి బయట పడేశారు.




జగన్ పాలనలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో అందరికీ తెలుసని హోంమంత్రి అనిత ఎద్దేవా చేశారు. కొన్ని అరాచక శక్తులు తమ ప్రభుత్వం హయాంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. గత ఐదేళ్లలో తెదేపా, భాజపా, జనసేనతో పాటు సాధారణ ప్రజలు కూడా ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. వైకాపా కవ్వింపు చర్యలతో కూటమి కార్యకర్తలు హద్దు మీరొద్దని సూచించారు. ఇరు పార్టీల శ్రేణులు సంయమనం పాటించాలని కోరారు. ఏదైనా సమస్య ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకుందామని విజ్ఞప్తి చేశారు.




## విజయసాయిపై సంచలన ఆరోపణలు

నెల్లూరు జిల్లా: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో హాట్ టాపిక్‌గా మారారు. మదన్‌మోహన్ మానిపాటి అనే వ్యక్తి దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతిపై ఆరోపణలు చేశారు. ఆమె తన భార్య అని.. తాను విదేశాల్లో ఉండగా వేరొకరితో గర్భం దాల్చిందని.. దీనిపై విచారణ జరిపి.. ఆ బిడ్డకు తండ్రి ఎవరో తేల్చాలని ఆంధ్రప్రదేశ్ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. తన భార్య గర్భానికి విజయసాయి రెడ్డి, న్యాయవాది సుభాష్‌లే కారణమనే ఫిర్యాదు చేస్తూ రాసిన లేఖలో తెలిపారు. పవిత్రమైన దేవదాయ శాఖలో ఈ అపవిత్రమైన పనులేంటని మదన్మోహన్ లేఖలో ప్రశ్నించారు. దేవదాయ శాఖలోని ఉద్యోగినితో సంబంధం ఆరోపణలపై ఆయన వివరణ ఇచ్చారు. సామాజిక మాధ్యమాల్లో ఈ విషయంపై విపరీతమైన చర్చ జరుగుతుండగా.. ఈ ఆరోపణలను నిరాధారమైనవని విజయసాయి రెడ్డి కొట్టిపారేశారు. రెండు రోజుల క్రితం మీడియాకు పలు విషయాలు వెల్లడించారు. ఆ సమయంలో టీడీపీ నేతలను విమర్శించారు. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు,మంత్రులు వరుసగా విజయసాయిక్ స్ట్రాంగ్ కౌంటర్లు ఇస్తున్నారు. తాజాగా విజయ సాయిరెడ్డి వ్యాఖ్యలపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. "ఎన్నికల ముందు A2 గురించి నేను చెప్పాను. ఆయన తండ్రి కూడా A2నే. ఆయన ఒక హత్య కేసులో ముద్దాయిగా ఉన్నారు. A2గా ఉంటే బాగుండదని A1గా మారేందుకు విశాఖపట్నంలో పలు కార్యక్రమాలు చేశారు. ట్విట్టర్ బాబాయిని ట్విట్టర్ తాతయ్య చేసి A1గా ముద్ర వేశారు. ఇలాంటి దుర్మార్గపు నాయకులు మనకు అవసరమా..?ఐదేళ్లలో దురాగతాలు చేశారు. నెల్లూరు ప్రజలు ఓడించి మంచి పని చేశారు. పాత్రికేయ సమావేశంలో తన మీద నిందలు వేసిన వారి గురించి మాట్లాడకుండా మీడియా గురించి బూతులు తిట్టారు. మంత్రి నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల గురించి ట్వీట్లు చేశారు. అప్పుడు కుటుంబ విలువలు గుర్తుకు రాలేదా..? శాంతి అనే ఉద్యోగి దేవదాయా శాఖలో సహాయ కమిషనర్‌గా ఉంది. ఆమె ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉంది. 2019లో సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైంది. ఆమెకు విశాఖలో పోస్టింగ్ ఇచ్చారు'' అని మంత్రి ఆనం రామానారాయణ రెడ్డి తెలిపారు.

**శాంతికి రాజకీయ నేతలతో సంబంధాలు :** "ఆమెపై వచ్చిన ఆరోపణలపై కమిషనర్ స్థాయి అధికారులు విచారణ చేసి సస్పెండ్ చేశాం. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండే ఉంటే సస్పెన్షన్ కు జరిగేది కాదేమో. ఆమెకు రాజకీయ నేతలతో సంబంధాలు ఉన్నాయి. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడ్డారు. విజయవాడలో విల్లా కొనుక్కోవాలని కమిషనర్‌కు అనుమతి కోసం దరఖాస్తు చేసింది. అందుకు కమిషనర్ అనుమతి ఇవ్వలేదు.అపార్ట్‌మెంట్ కొనుగోలుకు అనుమతించారు. విశాఖపట్నంలో విజయసాయిరెడ్డి చేసిన రెవెన్యూ దండాలు రెవెన్యూ న్యాయవాది సుభాష్ ..శాంతిల పాత్ర ఉందని మాకు సమాచారం అంది. ప్రభుత్వ భూములతో పాటు దేవాదాయ శాఖ భూములను కూడా.. అక్రమంగా కొల్లగొట్టారని ఆరోపణలు ఉన్నాయి. వీటిపై కూడా విచారణ చేస్తున్నాం. దేవాదాయ శాఖ భూములను 99 సంవత్సరాల లీజుకు కూడా ఇచ్చారు. నివేదికలు వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు అనుమతితో తదుపరి చర్యలు తీసుకుంటాం" అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

## అవినీతి గురించి జగన్ మాట్లాడటం వింతగా ఉంది: మంత్రి నారా లోకేశ్



అమరావతి: హింస, విధ్వంసం, అరాచకం, అన్యాయం, అవినీతి గురించి జగన్ మాట్లాడటం వింతగా ఉందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్(ట్విటర్) వేదికగా పోస్టు చేశారు. "రాష్ట్రంలో బాధితులనే నిందితులుగా చేసిన చీకటి రోజులు పోయి నెల దాటింది. కూటమి ప్రభుత్వం మిగిలిన ఆ అరాచకపు ఆనవాళ్లను కూడా కూకటివేళ్లతో పెకలించేస్తోంది. ప్రజా తీర్పుతో ఉనికి కోల్పోయిన జగన్ అసత్య ప్రచారాలతో అబద్ధపు పునాదులపై మళ్లీ నిలబడాలని చూస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏం జరిగినా హత్యా రాజకీయాలంటూ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. శవాలతో రాజకీయాలు చేసే మీ విష సంస్కృతికి ప్రజలు ఇచ్చిన తీర్పే మొన్నటి ఎన్నికల ఫలితాలు అని ఇంకా అర్థం చేసుకోకపోతే ఎలా? నేరాలు చేసి మళ్లీ వాటిని వేరే వారిపై నెట్టడం అనే మీ కపట నాటకాలకు కాలం చెల్లింది. ప్రజల రక్షణకు కట్టుబడి ఉన్నాం. ఏ ఘటననూ ఉపేక్షించం.. ఏ నిందితుడినీ వదిలేది లేదు. బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చుని ఇక్కడ కుట్రలు అమలు చేయాలంటే కుదరదు. మీ హెచ్చరికలకు భయపడే ప్రభుత్వం కాదు. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రజా ప్రభుత్వమిది" అని లోకేశ్ తెలిపారు.

## పరీక్ష కేంద్రాల వారీగా 'నీట్' ఫలితాలు ప్రకటించండి - సుప్రీం కోర్టు



దిల్లీ: నీట్-యూజీ పేపర్ లీకేజీ, పరీక్ష నిర్వహణలో అవకతవకలపై విచారణ జరుపుతోన్న భారత సర్వోన్నత న్యాయస్థానం.. పరీక్ష కేంద్రం, నగరాల వారీగా వాటి ఫలితాలు ప్రకటించాలని ఎన్‌టీఏను ఆదేశించింది. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు వాటిని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని పేర్కొంది. 'నీట్- యూజీ' సంబంధిత పిటిషన్‌లను జులై 22న తిరిగి విచారిస్తామని సుప్రీం కోర్టు పేర్కొంది. పరీక్ష కేంద్రాల వారీగా ఫలితాలను వెల్లడించేటప్పుడు విద్యార్థుల వివరాలను కనిపించకుండా చూడాలని సూచించింది.




## వినుకొండలో దారుణహత్యపై జిల్లా ఎస్పీ కీలక ప్రకటన

వినుకొండ: బుధవారం రాత్రి పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని ముండ్లమూరు బస్టాండ్ వద్ద నడిరోడ్డుపై, అందరూ చూస్తుండగా కత్తులతో షేక్ రషీద్ అనే యువకుడి దారుణ హత్య ఘటనపై పల్నాడు జిల్లా ఎస్పీ కే.శ్రీనివాసరావు స్పందించారు. వినుకొండలో వ్యక్తిగత కక్షలతోనే హత్య జరిగిందని అన్నారు. ఇద్దరి మధ్య వ్యక్తిగత కారణాలు వల్ల మాత్రమే ఈ హత్య జరిగిందని, ఈ హత్య కు రాజకీయ పార్టీలకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటించారు. హత్య చేసిన జిలానీ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. కాగా హత్య నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వినుకొండ పట్టణంలో 144 సెక్షన్ విధించామని వివరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే సహించేది లేదని, చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామని వార్నింగ్ ఇచ్చారు. కాగా ముండ్లమూరు బస్టాండ్ వద్ద నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా షేక్ రషీద్ అనే యువకుడు ముండ్లమూరు బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి బయటకు వస్తుండగా... అదే సమయంలో హతుని మాజీ మిత్రుడు, పట్టణానికి చెందిన షేక్ జిలానీ కత్తితో రషీద్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. చేతులు, తల, మెడపై కత్తితో కొట్టాడు. రషీద్ చెయ్యి తెగి రోడ్డుపై పడిపోయింది. ఈ ఘటనను హత్యారాజకీయం చేయాలని భావించిన విపక్ష వైసీపీ.. ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేసింది. రాష్ట్రంలో పరిస్థితులు దిగజారాయంటూ ప్రచారానికి దిగింది. సోషల్ మీడియా వేదికగా ఫేక్ పోస్టులు పెడుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ స్పందించారు.

**ఖండించిన టీడీపీ..** వినుకొండలో దారుణ హత్య ఘటనపై విపక్ష వైసీపీ విష ప్రచారం చేస్తున్న నేపథ్యంలో అధికార తెలుగుదేశం పార్టీ స్పందించింది. పొద్దున్నే 3 గంటలకు ఫోన్ చేసి బాబాయ్‌ని చంపేసి.. చంద్రబాబు చంపాడని పేపర్‌లో వేసిన నీచ చరిత్ర వీళ్లదని టీడీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏది జరిగినా ముందు టీడీపీ మీద తోసేయటమే పనిగా పెట్టుకున్నారని మండిపడింది. "తప్పు ఎవ్వడు చేసినా తప్పే... తప్పు చేసిన వాడిని కూడా కఠినంగా శిక్షించాలి. 5 ఏళ్లు విచ్చలవిడిగా రెచ్చిపోయిన ఈ వైసీపీ సైకోలకి పట్టిన మదం దించి, గంజాయిని అరికట్టటం, వైసీపీ సైకోలు చేసే ఈ దారుణాలు ఆపటడమే మా ప్రభుత్వ లక్ష్యం" అని టీడీపీ తేల్చి చెప్పింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించింది. హతుడు షేక్ రషీద్, చంపిన వ్యక్తి షేక్ జిలానీ ఇద్దరూ వైసీపీ వారేనని, వీరిద్దరూ వినుకొండలో రౌడీగా చెలామణి అవుతున్న వైసీపీ నేత పీఎస్ ఖాన్‌కు ప్రధాన అనుచరులు అనే విషయాన్ని పేర్కొంది. జగన్ రెడ్డికి ఈ పీఎస్ ఖాన్ ప్రధాన అనుచరుడు అని మండిపడింది. ఈ మేరకు 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన కథనాన్ని తెలుగు దేశం పార్టీ 'ఎక్స్' వేదికగా షేర్ చేసింది.

## వాగులో కొట్టుకుపోయిన కారు.. బాధితులంతా సురక్షితం



ఏలూరు: భారీ వర్షాలతో ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని ఓ వాగులో కారు కొట్టుకుపోయిన ఘటనలో అందులోని ఐదుగురూ సురక్షితంగా బయటపడ్డారు. బాధితులను అతికష్టం మీద గ్రామస్థులు, పోలీసులు ఒడ్డుకు తీసుకొచ్చారు. అశ్వారావుపేట నుంచి వేలేరుపాడు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కొట్టుకుపోయిన కారులో ఇద్దరు మహిళలు సహా ఐదుగురు ఉన్నారు. కారులో ఉన్నవారిని డ్రైవర్ రామారావు, జ్యోతి, గడ్డం కుందనకుమార్, సాయి జ్యోతి, గడ్డం జగదీశ్‌కుమార్‌గా గుర్తించారు. కొద్దిదూరం వెళ్లాక కారు నుంచి బయటకు వచ్చి వాగులోని పొదల్లో ఆ ఐదుగురూ చిక్కుకున్నారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వచ్చే లోపే.. పోలీసులు స్థానికుల సహాయంతో బాధితులను ఒడ్డుకు చేర్చారు.

## వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటన.. పుంగనూరులో ఉద్రిక్తత

పుంగనూరు: చిత్తూరు జిల్లా పుంగనూరులో ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైకాపా, ఎన్డీయే కార్యకర్తల మధ్య రాళ్లదాడి జరిగింది. వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ పార్టీ మాజీ ఎంపీ రెడ్డప్ప ఇంటికి మిధున్‌రెడ్డి వెళ్లారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఎంపీ వేధింపులకు గురిచేశారంటూ ఎన్డీయే కార్యకర్తలు రెడ్డప్ప ఇంటి వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో వైకాపా కార్యకర్తలు.. తెదేపా, జనసేన, భాజపా కార్యకర్తలపై రాళ్లతో దాడి చేశారు. దీంతో కూటమి కార్యకర్తలు ప్రతిఘటించారు. తిరిగి వైకాపా కార్యకర్తలపై రాళ్లు విసిరారు. 'మిథున్‌రెడ్డి గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఆందోళనకారులను



చెదరగొట్టి ఇరువర్గాలను అదుపులోకి తీసుకొచ్చేందుకు యత్నించారు. అనంతరం ఎంపీని పోలీసులు గృహనిర్బంధం చేశారు.

# జిమ్ లో అనసూయ.. స్టన్ అయ్యేలా..

అనసూయ భరద్వాజ్ యాంకర్ గా కంటే ఇప్పుడు నటిగానే మరింత క్రేజ్ అందుకుంటోంది. ఈ సుందరిని మొదట బుల్లితెరపై చూసి ప్రేక్షకులు ఎంతగానో అభిమానించటం ప్రారంభించారు. అయితే ఆమె కేవలం మంచి మాటలతోనే కాకుండా, తన గ్లామర్ తో కూడా ప్రేక్షకుల మనసు దోచేసింది. అనసూయ రావటంతో యాంకరింగ్ కి గ్లామర్ అనే కొత్త అర్థం వచ్చిందని చెప్పవచ్చు. అనసూయ బుల్లితెరపై తన ప్రతిభను చూపిస్తూ, క్రేజ్ ని బిగ్ స్క్రీన్ కి తీసుకువెళ్ళింది. ఆమె నటనలో కొత్త తరహా ప్రయోగాలు చేస్తూ, పవర్ఫుల్ పాత్రల్లో కనిపించడం, తన కెరీర్ కు కొత్త మలుపు తెచ్చింది. సాధారణ పాత్రలకు మాత్రమే కాకుండా, నెగిటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్ చేయడం ద్వారా అనసూయకు వరుస అవకాశాలు వస్తున్నాయి. జబర్దస్త్ షో తో మంచి పేరు తెచ్చుకున్న అనసూయ, ఆ తరువాత వివిధ షోల్లో కూడా తన ప్రతిభను చాటుకున్నారు. క్షణం సినిమాలో చేసిన మంచి పాత్రతో ఆమె కెరీర్ కొత్త మలుపు తిరిగింది. ఈ సినిమా ఆమెను ప్రేక్షకులకు మరింత దగ్గర చేసింది. రంగస్థలం



సినిమాలో రంగమ్మత్త పాత్రతో అనసూయ నటనకు మంచి గుర్తింపు వచ్చింది. ఈ పాత్ర ద్వారా ఆమెకు ప్రేక్షకుల నుంచి విపరీతమైన ఆదరణ లభించింది. అనసూయ ఎక్కడికెళ్లినా అభిమానులు రంగమ్మత్త అని పిలుచుకుంటూ ఆమెపై ప్రేమను చూపిస్తారు. ఈ పాత్ర ఆమె కెరీర్ కు ఎంతో బలం చేకూర్చింది. అనసూయ గ్లామర్ షో ద్వారా తన వయసును తగ్గించుకుంటూ, యువతను ఆకట్టుకుంటుంది. రీసెంట్ గా జిమ్ లో కసరత్తులు చేస్తున్న ఆమె ఒక మిర్రర్ సెల్ఫీతో ఆకట్టుకుంది. ఈ గ్లామర్ లుక్స్ లో కూడా అమ్మడు ఎంతో అందంగా ఉందని అంటున్నారు. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయిపోయాయి. ఇక సినిమాల విషయానికి వస్తే, ప్రస్తుతం అనసూయ పుష్ప 2 సినిమాతో బిజీగా ఉంది. అలాగే మరో రెండు లేడీ ఓరియంటెడ్ ప్రాజెక్ట్స్ లో కూడా నటిస్తున్నారు. ఆమె ప్రతి పాత్రలో కొత్తగా కనిపించే ప్రయత్నం చేస్తూ, ప్రేక్షకుల మనసును గెలుచుకుంటున్నారు. అనసూయ భరద్వాజ్ తన ప్రతిభతో మరియు గ్లామర్ తో యాంకరింగ్ మరియు నటనలో సరికొత్త ట్రెండ్ ను సృష్టించారు. మరి రాబోయే రోజుల్లో ఆమె ఇంకా ఎలాంటి అవకాశాలు అందుకుంటారో చూడాలి.

## రహస్యంగా కానిచ్చారు..కానీ చూడగనే లవ్ రాలేదా?

తాప్సీ-బ్యాడ్మింటన్ ప్లేయర్ మాథియస్ బో మధ్య వ్యవహారం తెలిసిందే. ఇద్దరి మధ్య కొన్నాళ్లగా సీరియస్ రిలేషన్ షిప్ నడుస్తోంది. సీక్రెట్ గా వివాహం కూడా చేసుకున్నట్లు ప్రచారంలోకి వచ్చింది. కానీ ఇది క్లారిటీ లేని అంశం. తాప్సీ ఎక్కడా పెళ్లి చేసుకున్నట్లు అధికారికంగా చెప్పలేదు. దీంతో ఈ పెళ్లిపై రకరకాల సందేహాలున్నాయి. ఆ సంగతి పక్కనబెడితే తాజాగా అమ్మడు ప్రియుడు గరించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. మాథియస్ ని చూడగానే ముందుగా ప్రేమ పుట్టలేదుట. ఓ సాధారణ మనిషిగానే అనిపించిందిట. తొలి చూపులో కేవలం గౌరవం మాత్రమే ఏర్పడిందిట. ఆ తర్వాత రెగ్యులర్ గా కలుసుకోవడం మొదలైన తర్వాత అదే సాధారణ మనషికి మనసులో స్థానం కల్పించినట్లు చెప్పుకొచ్చింది. అలాగని ప్రేమ విషయాన్ని వెంటనే మాథియస్ కి చెప్పలేదుట. మనసులో భావాలు పంచుకోవడానికి చాలా సమయం తీసుకుందిట.



ప్రేమ..పెళ్లి అనేవి వర్కౌట్ అవుతాయా? లేదా? అని కూడా సీరియస్ గానే ఆలోచన చేసిందిట. అలా మాథియస్ తో అమ్మడు లవ్ లో పడినట్లు చెప్పుకొచ్చింది. కానీ పెళ్లి విషయం మాత్రం గోప్యంగానే ఉంచింది. ఆ టాపిక్ ఎక్కడా రాకుండా జాగ్రత్త పడింది. మరి ఇది రిలేషన్ షిపా? ఇద్దరు భార్యాభర్తలు అయ్యారా? లేదా? అన్నది మళ్లీ సస్పెన్స్ న్ గానే ముగించింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి. తాప్సీ మాథియస్ ని ప్రియుడిగా భావించి మాట్లాడిందా? భర్తగా భావించి స్పందించిందా? అంటూ నెటి జనులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక తాప్సీ కెరీర్ గురించి చెప్పాల్సిన పనిలేదు. బాలీవుడ్ కి వెళ్లిన దగ్గర నుంచి బిజీగానే కొనసాగుతుంది. కానీ నటిగా తాప్సీ మార్క్ అయితే ఇంకా పడలేదు. ప్రయత్నాలైతే చేస్తుంది గానీ ఫలించడం లేదు. అటు నిర్మాతగానూ రాణిస్తుంది. అక్కడా ఇంకా సక్సెస్ అవ్వలేదు. నటిగా, నిర్మాతగా ఫాంలో లేకపోయినా కెరీర్ ని మాత్రం ముందుకు తీసుకెళ్లడంలో సక్సెస్ అయింది. టాలీవుడ్ తరహాలో విఫలమైతే కాలేదు.




# యాక్టర్స్ గా ఫుల్ బిజీగా మారిపోయిన డైరెక్టర్స్!



సౌత్ సినిమాలో అనేక మంది దర్శకులు ఇప్పుడు యాక్టర్స్ గా బిజీగా మారుతున్నారు. మెగా ఫోన్ పట్టుకొని స్టార్ట్ కెమెరా యాక్షన్ అని చెప్పే డైరెక్టర్స్.. కెమెరా ముందుకి వచ్చి తమలోని మరో కోణాన్ని తెర మీద ఆవిష్కరిస్తున్నారు. వారిలో కొందరు ఓవైపు నటిస్తూనే మరోవైపు దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మరికొందరు మాత్రం మేకప్ వేసుకొని పూర్తిగా యాక్టింగ్ కే పరిమితం అవుతున్నారు. దీనికి తగ్గట్టుగానే మంచి రెమ్యునరేషన్ తీసుకుంటున్నారు.

ఖుషి దర్శకుడు ఎస్.జె. సూర్య నటుడిగా తమిళ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. విలన్ గా, క్యారక్టర్ ఆర్టిస్ట్ గా రాణిస్తున్నారు. ఇప్పుడు ఏ సినిమాలో చూసినా ఆయనే కనిపిస్తున్నారు. 'స్పైడర్' మూవీకి విలన్ గా మెప్పించిన సూర్య.. ప్రస్తుతం 'గేమ్ ఛేంజర్' చిత్రంలో ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఇటీవలే 'ఇండియన్ 2' లో కనిపించారు. వచ్చే ఏడాది విడుదల కానున్న 'ఇండియన్ 3'లోనూ భాగం కానున్నారు. 'సరిపోదా శనివారం', 'రాయన్', 'సర్దార్ 2', 'ఎల్ఐసి', 'వీర ధీర శూరన్' వంటి మరికొన్ని చిత్రాల్లో సూర్య నటిస్తున్నారు. శివ కార్తికేయన్, ఫహద్ ఫాసిల్ ల రాబోయే సినిమాల్లోనూ కీలక పాత్రలు పోషించనున్నారు.

'ఏమాయ చేసావే', 'సూర్య S/o కృష్ణన్', 'ఏటో వెళ్లిపోయింది మనసు' వంటి చిత్రాలతో సెన్సిబుల్ డైరెక్టర్ గా పేరు తెచ్చుకున్న గౌతమ్ వాసుదేవ్ మీనన్ సైతం పూర్తి స్థాయి నటుడిగా మారిపోయారు. నందమూరి బాలకృష్ణ హీరోగా తెరకెక్కుతున్న 'NBK 109' మూవీలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అలానే 'విడుదల 2', 'బజూకా' వంటి తమిళ మలయాళ చిత్రాల్లోనూ నటిస్తున్నారు. ఆయన దర్శకత్వం వహించిన 'ధృవ నక్షత్రం' సినిమా విడుదలకి నోచుకోలేదు. అయితే యాక్టర్ గా బిజీగా ఉంటూనే, డైరెక్టర్ గానీ మధ్యనే మమ్ముట్టితో ఓ ప్రాజెక్ట్ ప్రారంభించారు.

'7/G బృందావన కాలనీ', 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' చిత్రాల దర్శకుడు సెల్వ రాఘవన్.. ప్రస్తుతం యాక్టర్ గా మెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన సోదరుడు ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'రాయన్' సినిమాలో కీలక పాత్రలో కనిపించనున్నారు. రవితేజ, గోపీచంద్ మలినేని కాంబోలో అనౌన్స్ చేసిన RT4GM సినిమాతో నటుడిగా టాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తారని అనుకున్నారు కానీ, ఈ ప్రాజెక్ట్ హోల్డ్ లో పడింది. సీనియర్ దర్శకుడు భారతీరాజా, కెఎస్ రవికుమార్ కూడా నటులుగా రాణిస్తున్నారు.

పిశాచి, డిటెక్టివ్, సైకో వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న విలక్షణ దర్శకుడు మిస్కిన్.. నటుడిగానూ అలరిస్తున్నారు. ప్రస్తుతం డెవిల్, డ్రాగన్ అనే రెండు తమిళ సినిమాలలో నటిస్తున్నారు. ఆయన డైరెక్ట్ చేసిన 'పిశాచి 2' మూవీ ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. 'బ్రో' డైరెక్టర్ సముద్రఖని కూడా యాక్టర్ గా రాణిస్తున్నారు. రీసెంట్ గా 'ఇండియన్ 2' సినిమాలో మెరిశారు. ఇప్పుడు 'గేమ్ చేంజర్' తో పాటుగా 'రామం రాఘవం' అనే చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. టాలీవుడ్ డైరెక్టర్స్ లో తరుణ్ భాస్కర్ ఇటీవల కాలంలో యాక్టింగ్ మీదనే ఎక్కువ ఫోకస్ పెడుతున్నట్లు కనిపిస్తోంది. గతేడాది దాదాపు ఆరేడు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం ఆయన 'జయ జయ జయ జయహే' తెలుగు రీమేక్ లో హీరోగా నటిస్తున్నారు. కాశీ విశ్వనాథ్, దేవి ప్రసాద్, వెంకటేశ్ మహా, కరుణ కుమార్, శ్రీను గవిరెడ్డి, వివేక్ కృష్ణ లాంటి మరికొందరు దర్శకుడు బిగ్ స్క్రీన్ మీద యాక్టర్స్ గా కనిపించారు. ఇటీవల 'కల్కి 2898 AD' మూవీలో ఎస్.ఎస్. రాజమౌళి, రామ్ గోపాల్ వర్మ, అనుదీప్ కేవీ లాంటి డైరెక్టర్స్ స్పెషల్ క్యామియోలు చేసిన సంగతి తెలిసిందే.

# భార్యను భర్త ఇలా కూడా ప్రశంసించొచ్చా నిక్?






భార్య ఘనకార్యాన్ని భర్త కొనియాడటం అంటే ఇదేనేమో! ఇదిగో ఇక్కడ షేర్ చేసిన ఈ హాలి ఫోటోని ప్రదర్శించిన నిక్ జోనాస్.. 'భార్యకు ప్రశంసల పోస్ట్' అనే అందమైన ట్యాగ్ ఇచ్చాడు. నిజమే... ప్రియాంక చోప్రా ఒక లక్కీ గాళ్! అని పొగిడేయాలో ఈ బోల్డ్ ప్రశంసను ఏమనాలో అర్థం కాని పరిస్థితి. నిక్ జోనాస్- ప్రియాంక చోప్రా జంట నడుమ బోల్డ్ నెస్ గురించి కానీ ఆప్యాయతల గురించి కానీ సందేహించాల్సిన పని లేదు. ఓవైపు నిక్ జోనాస్ సోదరుడు జో జోనాస్- సోఫీ టర్నర్ కాపురంలో కలతలు మొదలైనా కానీ, నిక్ - పీసీ జంట ప్రజల ప్రశంసలు అందుకుంటూనే ఉన్నారు. నిక్ కుటుంబ సభ్యులంతా పీసీని చూసి నేర్చుకోవాలని సోఫీకి సూచించారని, భారతీయతలోని స్వచ్ఛత, సాంప్రదాయం సంస్కృతిలను పొగిడేయడంతోనే సోఫీకి కాలిందని కూడా గుసగుసలు వినిపించాయి. అదంతా అటుంచితే ప్రియాంక చోప్రా కాలి సౌందర్యాన్ని థై సొగసుల్ని ఆవిష్కరిస్తూ నిక్ ఇప్పుడు షేర్ చేసిన ఈ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో హాట్ డిబేట్ కి తావిచ్చింది. ప్రియాంక చోప్రా ఈ ఫోటోగ్రాఫ్ లో స్ట్రైకింగ్ ఫోజ్ తో కట్టి పడేసింది. అందమైన పొడుగ కాళ్ల సౌందర్యాన్ని పీసీ ఆవిష్కరించిన తీరు ఆకర్షించింది. వీటన్నిటినీ మించి పీసీ టూ యంగ్ గా కనిపించడం ఆశ్చర్యపరుస్తోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ప్రియాంక చోప్రా ది బ్లఫ్ షూటింగ్ కోసం ఆస్ట్రేలియాలో ఉంది. షూటింగుల సమయంలో ఆమె కూతురు మాల్తీ మేరీ కూడా స్పాట్‌లోనే ఉంటోంది. గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కుమార్తె విషయంలో ఎంతో జాగ్రత్త వహిస్తోంది. బాలీవుడ్ లో కత్రినా కైఫ్, అలియా భట్ లతో కలిసి పీసీ భారీ మల్టీస్టారర్‌లో నటిస్తోంది. ఫర్హాన్ అక్తర్ తెరకెక్కిస్తున్న 'జీ లే జరా' త్వరలోనే ప్రారంభం కానుందని సమాచారం. నిక్ జోనాస్ తదుపరి 'ది గుడ్ హాఫ్'లో కనిపించనుందని సమాచారం. ఇది ఒక అమెరికన్ కామెడీ-డ్రామా. ఇందులో బ్రిటనీ స్నో కూడా నటించింది.

# దిశా పటానీ అన్‌లిమిటెడ్ ట్రీట్

లోఫర్ బ్యూటీ దిశా పటానీ చాలా కాలం తర్వాత టాలీవుడ్ లో తిరిగి అడుగుపెడుతోంది. ప్రభాస్ కల్కి 2898 %ూణ% చిత్రంలో దిశా పటానీ ఛమక్కులను వీక్షించేందుకు అభిమానులు చాలా ఆత్రుతగా వేచి చూస్తున్నారు. ఇంతకుముందే ఆన్ లొకేషన్ ప్రభాస్ తో దిశా ఎంతో సన్నిహితంగా ఉన్న ఫోటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. ఇక టాలీవుడ్ తో పాటు కోలీవుడ్ లోను దిశా ఎంట్రీ ఇస్తోంది. అక్కడ సూర్య పాన్ ఇండియన్ సినిమా 'కంగువ'లో దిశా స్పెషల్ అప్పియరెన్స్ అంతే ఛమక్కులా మైమరిపిస్తుందని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే సోషల్ మీడియాల్లో సీకే బ్యూటీ దిశా నిరంతర ట్రీట్ గురించి అభిమానులు అంతే ఆసక్తిగా ముచ్చటించుకుంటున్నారు. తాజాగా దిశా పటానీ సమ్మర్ లుక్ వైరల్ గా మారింది. ఇది బీచ్ వెకేషన్.. బోట్ షికార్‌లతో ఫుల్ గా చిల్ అవుతోంది పటానీ. ఈ సందర్భంగా స్పెషల్ ఫోటోషూట్ తో అలరించింది. ఒక ఫోటోగ్రాఫ్



లో అంతగా బరువు లేని సింపుల్ ఫ్రాకులో దిశా అందంగా కనిపించింది. దిశా తన తలను పక్కకు తిప్పి మిర్రర్ లో వీక్షిస్తూ అందంగా నవ్వుకుంటోంది. మరో ఫోటోలో దిశా చిట్టి పొట్టి నిక్కరులో ప్రత్యక్షమైంది. బ్లూడెనిమ్స్ షార్ట్, పైన రెడ్ టాప్ తో ఎంతో హాలిగా కనిపిస్తోంది. ఇదే ఫోటోషూట్ లో స్నేహితురాలితో కలిసి బోట్ షికార్ చేస్తూ సందడిగాను కనిపిస్తున్న వీడియోని దిశా పటానీ షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఇన్ స్టా షూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. అందంగా నవ్వావు కానీ ఎందుకలా అటువైపు తిప్పేసుకున్నావు! అంటూ దిశా మిర్రర్ ఫోటోని వీక్షించిన అభిమానులు సరదాగా కామెంట్ చేస్తున్నారు. దిశా స్మైల్ మాత్రమే కాదు.. తన పర్ఫెక్ట్ ఫిట్ బాడీకి ప్రత్యేకించి ఫ్యాన్సున్నారు. దిశా నటించిన యోధ ఇటీవలే విడుదలై ఆకట్టుకుంది. తదుపరి పెద్ద సినిమాల రిలీజ్ ల కోసం ఎంతో ఆసక్తిగా వేచి చూస్తోంది.

## ఒళ్లంతా ముత్యాలతో బేబమ్మ!

తెలుగులో ఫస్ట్ మూవీ ఉప్పెనతో బేబమ్మగా అందరి మనసుల్లో నిలిచిపోయింది కృతి శెట్టి. హీరోయిన్ గా తొలి సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది. అలా డెబ్యూ మూవీతో హిట్ కొట్టడం చాలా తక్కువమందికి జరుగుతుంటుంది. అంతే కాదు.. తన ఫస్ట్ సినిమా రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. అయితే ఆ తర్వాత నేచురల్ స్టార్ నాని శ్యామ్ సింగరాయ్ మూవీలో సెకండ్ హీరోయిన్ గా కనిపించి మరో విజయాన్ని అందుకుంది కృతి. యంగ్ హీరో అక్కినేని నాగచైతన్యతో కలిసి బంగార్రాజు సినిమాలో యాక్ట్ చేసి హ్యాట్రిక్ సాధించింది. ఆ మూవీలో తన క్యూట్ లుక్స్ తో అందరినీ మెప్పించింది. ఆ తర్వాత బ్యూటీ నటించిన సినిమాలు ప్రేక్షకులను పెద్ద ఆకట్టుకోలేకపోయాయి. దీంతో వరుసగా ఫ్లాపులతో సతమతవుతున్న ఈ బ్యూటీ.. కోలీవుడ్ లో అవకాశాలు అందుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు రీసెంట్ గా తెలుగులో మనమే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. జూన్ 7వ తేదీన విడుదలైన ఈ సినిమాలో సుభద్రగా బ్యూటిఫుల్ గా కనిపించి ఆకట్టుకుంది. ఈ మూవీతో పాటు మరికొన్ని చిత్రాల్లో కృతి నటిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో ఆ సినిమాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయని టాక్ వినిపిస్తోంది. అయితే సినిమాలు చేస్తూనే.. సోషల్



మీడియాలో యమా యాక్టివ్ గా ఉంటోంది కృతి. ఎప్పటికప్పుడు కొత్త కొత్త లుక్స్ పోస్ట్ చేస్తూ ఓ రేంజ్ లో ఫాలోవర్లను పెంచుకుంటోంది అమ్మడు. తన ఫ్రెష్ అండ్ పెప్పర్ లుక్స్ షేర్ చేస్తూ కుర్రాళ్ల మతులు పోగుడుతుంటోంది కృతి శెట్టి. సన్నని నడుముతో మాయ చేస్తుంటోంది. రకరకాల ఔట్ ఫిట్స్ లో సందడి చేస్తుంటోంది. అందాల అరాచకమంటే ఏంటో చూపిస్తుంటోంది. స్కిన్ షోతో అలరిస్తుంటోంది. గ్లామర్ షో అంటే ఇలా ఉండాలంటూ రుచి చూపిస్తుంటోంది. తన ఫోజులతో నెట్టింట సెగలు పుట్టిస్తుంటోంది. ఎప్పటికప్పుడు తన పిక్స్ తో నెట్టింట ట్రెండింగ్ అవుతూనే ఉంటోంది. తాజాగా దివి నుంచి భువికి వచ్చిన ఏంజెల్ లా కనిపించి క్లీన్ బౌల్డ్ చేసింది. వైట్ కలర్ డ్రెస్ పై ముత్యాలతో అదరగొట్టేసింది. సింపుల్ హెయిర్ స్టైల్ తో వేరే లెవల్ లో అందాలు ఆరబోసింది. ప్రస్తుతం ఆమె పిక్స్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. బేబమ్మ దేవకన్యలా ఉందంటూ కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు. అందానికి ఇమేజ్ అంటూ రచ్చరచ్చ చేస్తున్నారు. లైకుల వర్షం కురిపిస్తూ కామెంట్ల బాక్స్ నింపేస్తున్నారు.




ములుగు జిల్లా: డీఎంహెచ్‌వో డా. అప్పయ్య తన ప్రాణాన్ని పణంగా పెట్టి ఆదివాసులకు వైద్యం అందించారు. కొండ కోణల్లో ఉండే గిరి పుత్రులు జ్వరాలతో బాధ పడుతూ మెరుగైన వైద్యానికి నోచుకోక.. వారు బయటకు రాలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి అప్పయ్య నేరుగా తానే ఆదివాసుల దగ్గరకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. తన వైద్య బృందంతో కలిసి ములుగు జిల్లా, వాజేడు మండలంలోని పెనుగోలుకు బయలుదేరి మార్గ మధ్యలో వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా ఓ పెద్ద వాగును సయితం ధైర్యంగా దాటారు. మంగళవారం ఇంటి నుంచి బయలుదేరిన డాక్టర్ అప్పయ్య దట్టమైన అడవిలో 16 కి.మీ. నడిచారు. ఈ క్రమంలో అడ్డు వచ్చిన వాగులు, వంకలు దాటుకుంటూ సాహసంతో ముందుకు వెళ్లారు. సాయంత్రానికి గ్రామానికి చేరుకుని, గిరిజనుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వారికి మందులు అందించారు. జ్వరం భారిన పలువురికి వైద్య పరీక్షలు చేశారు. రాత్రి తిరిగి వచ్చే అవకాశం లేకపోవడంతో అక్కడే గిరిజనులతో కలిసి బస చేశారు. తిరిగి మరుసటి రోజు బుధవారం ఇంటికి చేరుకున్నారు. స్వయాన ఆదివాసి అయిన అప్పయ్య వారి సమస్యలను తెలుసుకుని అక్కడికి నేరుగా వెళ్లి వైద్య సేవలు అందించడాన్ని అందరూ అభినందిస్తున్నారు. ఇది ఒక పెద్ద సాహసమేనని చెప్పుకోవాలి. డా. అప్పయ్య తన ప్రాణాలను పణంగా పెట్టి గిరిజనులకు వైద్యం అందించాలనే తపనతో 16 కి.మీ. అడవిలో నడుచుకుంటూ గుట్టలు ఎక్కి దిగుతూ.. వాగులు దాటుకుని పెనుగోలు ఆదివాసి గూడెంకు వెళ్లారు. ఆ గూడెంకు వేసవి కాలం మాత్రమే నడక దారి ఉంటుంది. వర్షాకాలం అయితే ఆ గ్రామం చుట్టూ వాగులు.. వంకలే ఉంటాయి. దీంతో ఆదివాసీలు కిందికి రాలేని పరిస్థితి. వాళ్లు అడవిలో దొరికే దుంపలు, గడ్డలు తింటూ జీవనం సాగిస్తుంటారు. వారికి సీజనల్ వ్యాధులు వస్తున్న నేపథ్యంలో.. ఈ విషయం తెలుసుకున్న డా. అప్పయ్య తన వైద్య బృందంతో గూడెంకు వెళ్లి వారికి వైద్య సేవలు అందించారు. బాహ్య ప్రపంచానికి అందుబాటులో లేని గిరిజనులకు వైద్య సేవలు అందించడంతో సర్వత్రా అభినందులు వెల్లువెత్తుతున్నాయి.

# 40 ఏళ్లలో ఎవ్వరూ ఇంత సాహసం చేయలేదు..



హైదరాబాద్: రైతులకు రెండు లక్షల ఋణమాపి చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా ఋణమాఫీ నిర్ణయం తీసుకోవడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ వరంగల్ రైతు డిక్లరేషన్ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షలు రైతు రుణమాఫీ అమలు చేస్తోందన్నారు. రైతు ఋణమాఫీ గురించి గతంలో చాలా ఆందోళనలు జరిగినా.. ఎవ్వరూ ఇంత ధైర్యం చేయలేదని ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు. మొదటి దఫా 11లక్షల 50 వేల మంది రైతులకు లక్ష లోపు రూ.7వేల కోట్లు సాయంత్రం నాలుగు గంటలకు జమ అవుతుందని ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు. మూడు దఫాలుగా 39 లక్షల మంది రైతులకు 31 వేల కోట్లు రైతుల అకౌంట్‌లో ప్రభుత్వం వేస్తుందని అన్నారు. రేషన్ కార్డు కుటుంబ వివరాల కోసమేనని తెలిపారు.పాస్ బుక్ ద్వారా రైతులందరికీ ఋణమాఫీ జరుగుతుందని పేర్కొన్నారు. చిన్న చిన్న సమస్యలు సాధారణంగా వస్తాయని.. సమస్యలను స్థానిక అధికారులు పరిష్కరిస్తారని ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. 40 ఏళ్లలో ఇంత గొప్ప కార్యక్రమం జరగలేదని ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు. మిగతా రాష్ట్రాలలో కూడా అమలు చేస్తే బాగుంటుందన్నారు. సాయంత్రం నుంచి రైతు వేదికల వద్ద ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త వేడుకల్లో పాల్గొనాలన్నారు. గ్రామాలలో పండగ వాతావరణం నెలకొందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ మూడు రోజులు సంబరాలు జరుపు కోవాలని కోరుతున్నానన్నారు.

గత ప్రభుత్వం లక్ష రూపాయల కూడా అందరికీ ఇవ్వలేదన్నారు. ఇది భారత దేశంలో నే చరిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. రైతులకు రెండు లక్షల ఋణమాఫీ చేయడం రైతు బిడ్డగా గర్వంగా ఫీలవుతున్నానని ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు.

# బ్యాంకింగ్ చరిత్రలోనే ఇది కనీవినీ ఎరుగని సందర్భం



హైదరాబాద్: దేశ చరిత్రలోనే మొట్ట మొదటిసారి ఒక ప్రభుత్వం రూ. 2లక్షల రుణ మొత్తాన్నీ మాఫీ చేయడం మీరు అందరూ ఈ రోజు చూస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్స్ సదస్సులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు తుమ్మల కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. తనకు తెలిసి మీ బ్యాంకింగ్ చరిత్రలోనే ఇది కనీవినీ ఎరుగని సందర్భమని అన్నారు. మేము ఈ పథకం ప్రకటించి ఒకేసారి మాఫీ చేస్తామని చెప్పినప్పుడు చాలా మంది బ్యాంకర్లు కు కూడా నమ్మకం కుదరలేదని.. దానికి కారణం కూడా లేక పోలేదని తుమ్మల అన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వం రెండు విడతలలో చేసిన రుణమాఫీని మీరు ప్రత్యక్షంగా చూశారు కావున నమ్మలేదని తుమ్మల అన్నారు. అనేక మంది బ్యాంకర్స్ కూడా పలు సందర్భాల్లో గత రెండు పర్యాయాలు అమలు చేసిన తీరుతో రుణమాఫీ వల్ల రైతులకు ప్రయోజనం చేకూరలేదన్న అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేశారన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి అమలు చేస్తున్న 2లక్షల రుణ మాఫీ వంటి బృహత్తర కార్యక్రమంలో మీరందరు కూడా భాగస్వామ్యులేనన్నారు. మా ప్రభుత్వం ఈ రుణ మాఫీ పథకాన్ని ఆగస్ట్ కల్లా పూర్తి చేయడానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అన్న మాట ప్రకారం.. మొదటి విడతలో కుటుంబానికి లక్ష వరకూ ఉన్న పంట రుణాలన్నీ ఏకకాలంలో మాఫీ చేస్తున్నామని తుమ్మల పేర్కొన్నారు. 10,83,004 కుటుంబాలకు 6098.93 కోట్ల రూపాయలు ఈ రోజు వారి రుణఖాతాలలో జమ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బ్యాంకర్లు అందరికీ మా ప్రభుత్వం తరపున ఒకటే విజప్తి చేస్తున్నట్టు తుమ్మల పేర్కొన్నారు. రైతు రుణాన్ని రెన్యువల్ చేసుకున్నట్లయితే వారికి నగదు రూపంలో ఖాతాలకు జమచేయబడిన మొత్తాన్ని చెల్లించాలని తెలిపారు. ఒకవేళ రైతు పంటరుణాన్ని బాకీ పడ్డట్లైతే వారికి ప్రభుత్వాలు విడుదల చేసిన మొత్తాన్ని రుణం కింద జమ చేసుకొని, కొత్త రుణాన్ని వెంటనే మంజూరు చేయాలని తుమ్మల సూచించారు. ప్రభుత్వం నుంచి పంట రుణమాఫీకి చెల్లించే మొత్తం రైతులకు తప్పకుండా చేరే బాధ్యత ప్రతి ఒక్క బ్యాంకు తీసుకోవాలి. ఆ విధంగా మీ శాఖలన్నింటికి అదేశాలు ఇవ్వాలని తుమ్మల సూచించారు. ప్యాక్స్‌లకి సంబంధించి డీసీసీబీలకి విడుదల చేసే మొత్తం ఒకటి లేదా రెండు రోజుల్లో సంబంధిత రైతుల ఖాతాలకు జమ చేయాల్సిందేనన్నారు. వచ్చే నెల రోజులు బ్యాంకులలో రద్దీని తట్టుకొనే విధంగా ఏర్పాట్లు చేసుకోండి. రుణాల రెన్యువల్, నగదు చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయించాలని సూచించారు. ఏ బ్యాంక్ అయినా ప్రభుత్వ ఉత్తర్వులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఈ ప్రభుత్వం ఎట్టిపరిస్థితులలోనూ ఉపేక్షించబోదని తుమ్మల అన్నారు.

# నటుడు రాజ్ తరుణ్ న్యాయవాది ద్వారా పోలీసులకు సమాధానం




హైదరాబాద్: టాలీవుడ్ నటుడు రాజ్ తరుణ్ తన న్యాయవాది ద్వారా పోలీసులకు సమాధానం ఇచ్చారు. గురువారం పోలీసులు ఎదుట హాజరు కావాలన్న నోటీసులకు లాయర్ ద్వారా సమాధానం పంపారు. తాను అందుబాటులో లేనని విచారణకు హాజరు కాలేనని రాజ్ తరుణ్ తెలిపారు. కాగా వ్యక్తి గతంగా రాజ్ తరుణ్‌ను విచారణ చేయాలనుకుంటున్న పోలీసులు.. మరోసారి నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల్లో రాజ్ తరుణ్ ప్రేమ..పెళ్లి వ్యవహారం సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. నటి లావణ్య.. నటుడు రాజ్ తరుణ్, నటి మాల్వీ మల్హోత్ర, ఆమె సోదరుడిపై నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో రాజ్?తరుణ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. గురువారం తమ ఎదుట విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. కాగా తెలుగు రాష్ట్రాల్లో, టాలీవుడ్ ఇండస్ట్రీలో పెను సంచలనం సృష్టిస్తున్న హీరో రాజ్ తరుణ్.. హీరోయిన్లు లావణ్య, మాల్వీ మల్హోత్రా కేసులో రోజుకో ట్విస్ట్ వెలుగు చూస్తుండగా.. తాజాగా ఊహించని రీతిలో బిగ్ ట్విస్ట్ చోటుచేసుకుంది.

ఇప్పటి వరకూ రాజ్ తరణ్ వర్సెస్ లావణ్యగా కేసు నడవగా సంచలన విషయాలే వెలుగుచూశాయి. అయితే.. మాల్వీ మల్హోత్రా గురించి షాకింగ్ విషయాలు వెలుగు చూడటంతో మరోసారి ఈ కేసు వ్యవహారం ఇండస్ట్రీలో బర్నింగ్ టాపిక్ అయ్యింది.




# ఎమ్మెల్సీ కవితకు ట్రయల్ కోర్టు గ్రీన్ సిగ్నల్!

న్యూ ఢిల్లీ/హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టయ్యి తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. జ్వరంతో బాధపడుతున్న ఆమెను మంగళవారం నాడు ఢిల్లీలోని ధీన్ దయాల్ ఆస్పత్రికి తరలించి సుమారు రెండు గంటలపాటు చికిత్స చేయగా కుదుటపడ్డారు. ఆస్పత్రి నుంచి మళ్లీ తీహార్ జైలుకు తరలించారు. కాగా.. కవితకు వైద్య పరీక్షల కోసం ట్రయల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**ఎయిమ్స్‌లో పరీక్షలు! :** ఎయిమ్స్ ఆస్పత్రిలో కవితకు వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులకు.. కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. వైద్యపరీక్షలు అనంతరం నివేదికను కోర్టుకు అందించాలని కోర్టు సూచించింది. కాగా.. నేటితో కవిత జ్యుడిషియల్ కస్టడీ ముగియగా.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జైలు అధికారులు రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరిచారు. అయితే.. కవిత జ్యుడీషియల్ కస్టడీ జులై-22 వరకు మరోసారి న్యాయస్థానం పొడిగించడం జరిగింది. ఈ క్రమంలో తనకు ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలను, పరీక్ష ఫలితాల్లో వ్యత్యాసాలను మొత్తం పూసగుచ్చినట్లుగా న్యాయమూర్తి దృష్టికి కవిత తీసుకొచ్చారు.

**ప్రైవేట్‌లో చెకప్‌లు! :** కాగా.. అస్వస్థత కారణంగా ఇటీవలే దీన్ దయాళ్ ఆసుపత్రిలో కవితకు పరీక్షలు నిర్వహించినట్లుగా కోర్టుకు సీబీఐ, ఈడీ తరఫున లాయర్లు వివరించారు. ఈరోజు విచారణ సందర్భంగా ప్రైవేట్ ఆస్పత్రిలో చెకప్ కోసం కవిత తరపున న్యాయవాదులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే.. ఎయిమ్స్‌లో కవిత ఆరోగ్య పరీక్షలకు న్యాయస్థానం ఆదేశించింది. పరీక్షల అనంతరం ఇందుకు సంబంధించి పూర్తి నివేదికను కోర్టుకు సమర్పించాల్సి ఉంటుంది. ఆ తర్వాత కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందా..? అనేదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మరోవైపు.. ఇవాళ లేదా రేపు కవితను కలవడానికి బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీ వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

# నిరుద్యోగులను మోసం చేయం.. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం



హైదరాబాద్: నిరుద్యోగులు కోరుకునే విధంగా సానుకూలమైన ప్రకటన వచ్చే విధంగా కృషి చేస్తామని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ తెలిపారు. నిరుద్యోగులు చెప్పిన సమస్యలను పరిష్కరించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్తామని అన్నారు. ముఖ్యంగా డీఎస్సీ -గ్రూప్ 2 పరీక్షకు మధ్య తక్కువ వ్యవధి ఉందని తెలిపారు. ఇది లూడా ఉదేశపూర్వకంగా ఇచ్చిన డేట్స్ కాదని చెప్పారు. గతంలో డీఎస్సీ పరీక్షలు మే -జూన్ నెలలో ఉండేవని అన్నారు. బేగం పేట టూరిజం ప్లాజాలో నిరుద్యోగులతో ఈరోజు(గురువారం) ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, చరణ్ కౌశిక్, లోకేష్ యాదవ్ , బలలక్ష్మి, చెనగని దయాకర్, ఇతర ముఖ్యనాయకులు భేటీ అయ్యారు. నిరుద్యోగుల డిమాండ్లపై నేతలు చర్చించారు. నిరుద్యోగులు చెప్పిన సమస్యలు విన్నామని అన్నారు. అయితే అ రోజు యువకులు మరొకసారి డీఎస్సీ కంటే ముందు టెట్ నిర్వహించాలని కోరారని తెలిపారు. నిరుద్యోగుల కోరిక మేరకే అ రోజు టెట్ నిర్వహించామని తెలిపారు. అయితే అప్పటికే టీజీపీఎస్సీ పరీక్షలకు డేట్స్ ఇవ్వడంతో డీఎస్సీ -గ్రూప్ 2 పరీక్షలు వారం వ్యవధిలోనే వచ్చాయని వివరించారు. ఇది న్యాయమైన డిమాండ్ కాబట్టి.. తాను ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి వారి సమస్యను విన్నామని సీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. గ్రూప్ 2 పరీక్షల పై ఇక సానుకూలమైన ప్రకటన వచ్చేలా చూస్తామని అన్నారు. ఇక మిగితా సమస్యలు కూడా నిరుద్యోగుల తమ దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. రానున్న రోజుల్లో ఎలాంటి సమస్యలు రాకుండా వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో 80 వేల పుస్తకాలు చదివిన వ్యక్తి తో బీజేపీ నాయకులతో చర్చించి నిరుద్యోగులకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపారు. అసెంబ్లీలో అందరి ముందు కాంగ్రెస్ పార్టీకి నిరుద్యోగుల పట్ల ఉన్న చిత్తశుద్ధి చాటుకునే విధంగా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని ఉద్ఘాటించారు. ప్రభుత్వంలో ఉన్న ప్రతి ఖాళీ ని భర్తీ చేసి నిరుద్యోగుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని చాటుకుంటామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లాగా నిరుద్యోగులను మోసం చేయమని.. త్వరలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగ నియామకాల ప్రక్రియ నిర్లక్ష్యానికి గురైందని.. ఆ ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాలతో వివాదాలు కోర్టులకూ చేరాయని కాంగ్రెస్ నేతలు ముందు నుంచి చెబుతూ వస్తున్నారు. లీకేజీలు, పరీక్షల నిర్వహణలో లోపాల వల్ల పలు పరీక్షలు రద్దయ్యాయి. దీంతో.. నిరుద్యోగుల్లో అపనమ్మకం నెలకొంది. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కారు ఆ అపనమ్మకాన్ని పోగొట్టేలా చర్యలు తీసుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు.. నిరుద్యోగుల్లో భరోసా కల్పించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయనుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు టీజీపీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేసి, కొత్త పాలక మండలిని నియమించింది.

# రుణాలు మాఫీ చేయడం అభినందనీయం



నిజామాబాద్, జూలై 18: ఎంతో కాలంగా రైతులు ఎదురు చూస్తున్న రుణమాఫీ ఈరోజు సాయంత్రానికి ప్రారంభంకానుంది. దాదాపు లక్ష వరకు ఉన్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేయనుంది. ఈ సందర్భంగా మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణాలు మాఫీ చేయడం అభినందనీయమన్నారు. ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ దేశంలో తెలంగాణ మినహా మరే రాష్ట్రంలోనూ లేదని తెలిపారు. మొదటి విడతగా లక్ష లోపు రుణాలు ఈరోజు మాఫీ అవుతున్నాయన్నారు. ఈ డబ్బు నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేసి, వారిని రుణ విముక్తులు చేస్తున్నారన్నారు. ఒక రైతుగా సీఎంకు, మంత్రి వర్గానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రావు ధన్యవాదాలు తెలిపారు. కాగా.. ఈరోజు సాయంత్రానికి లక్ష వరకు ఉన్న రుణాలను మాఫీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. నిన్నటి పీసీసీ కార్యవర్గ సమావేశంలో సీఎం ఈమేరకు ప్రకటన చేశారు. రూ.లక్ష వరకు ఉన్న రైతురుణాలు మాఫీ చేస్తున్నామని తెలిపారు. రూ. 7వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోకి వెళతాయన్నారు. నెలాఖరులోగా రూ.లక్షన్నర వరకు ఉన్న రైతు రుణాలు మాఫీ చేస్తామన్నారు. ఆగస్టులో రూ. 2 లక్షల వరకు రైతుల రుణమాఫీ చేసి రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రతీ రైతును రుణ విముక్తి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రుణమాఫీ పేరుతో కేసీఆర్‌లాగా మాటలు చెప్పి రైతులను మభ్యపెట్టడంలేదన్నారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని స్పష్టం చేశారు. అందుకే ఏకమొత్తంలో రూ. 2లక్షల రుణమాఫీ పూర్తి చేస్తున్నామన్నారు. రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికే రూ. 2లక్షల రైతు రుణమాఫీ అని ముఖ్యమంత్రి రేవంత్ చెప్పుకొచ్చారు.

# కుక్కల దాడి ఘటనపై హైకోర్టులో విచారణ

హైదరాబాద్, జూలై 18: కుక్కల దాడిలో చిన్నారి మృతి చెందిన ఘటనపై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. నిన్న (బుధవారం) జవహర్‌నగర్‌లో కుక్కల దాడిలో సంవత్సరంన్నర బాలుడు మృతిచెందిన విషయం తెలిసిందే. దీనిపై ఈరోజు హైకోర్టులో విచారణకు రాగా... వీధి కుక్కల దాడి ఘటనలను నివారించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రభుత్వాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. జీహెచ్ఎంసీ వ్యాప్తంగా 3.79 లక్షల వీధి కుక్కలు ఉన్నాయని అడ్వకేట్ జనరల్ తెలిపారు. కుక్కల దాడి ఘటనలు నివారించేందుకు స్టేట్ లెవెల్ కమిటీలు ఏర్పాటు చేశామని ప్రభుత్వం వెల్లడించారు. హైదరాబాదులో ఆరు కేంద్రాల వద్ద కుక్కలకు స్టెరిలైజేషన్ చేస్తున్నామని హైకోర్టుకు సర్కార్ తెలియజేసింది. ఒక్కో కేంద్రం వద్ద సుమారు రోజుకు 200 కుక్కలకు స్టెరిలైజేషన్ ఉంటుందన్నారు. అయితే స్టెరిలైజేషన్ ద్వారా ఎలా దాడి ఘటనలను ఆపుతారని హైకోర్టు మరో ప్రశ్న వేసింది. షెల్టర్ హోమ్స్‌కు తరలిస్తే సమస్య పరిష్కారం అవుతుందని అనిమల్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. నాగపూర్‌లో దాదాపు 90 వేల కుక్కలను షెల్టర్ హోమ్‌లో పెట్టినట్టు హైకోర్టుకు అనిమల్ వెల్ఫేర్ తరపున న్యాయవాది చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలతో అనిమల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు భేటీ అయ్యి పరిష్కారం చూపాలని ధర్మాసనం తెలిపింది. అలాగే తదుపరి విచారణను రెండు వారాలకు హైకోర్టు వాయిదా వేసింది.

# డీఎస్సీ వాయిదాపై హైకోర్టులో విచారణ

హైదరాబాద్: డీఎస్సీ వాయిదాపై హైకోర్టులో విచారణ జరిగింది. పదిమంది నిరుద్యోగులు పిటిషన్ దాఖలు చేశారు. నిరుద్యోగుల తరపున సీనియర్ అడ్వకేట్ రవిచందర్ వాదించారు. నోటిఫికేషన్‌కు.. పరీక్షకు మధ్య 4 నెలల సమయం మాత్రమే ఇచ్చారన్నారు. ఈ నాలుగు నెలల వ్యవధిలో పరీక్షను వాయిదా వేయాలని నిరుద్యోగులు అనేక ఆందోళనలు చేశారని రవిచందర్ తెలిపారు. గ్రూప్ 1 పరీక్షను కూడా ఇదే రీతిలో నిర్వహించి అభ్యర్థులను గందరగోళానికి గురి చేశారన్నారు. నిరుద్యోగులు ఈ నాలుగు నెలల వ్యవధిలో అనేక పరీక్షలు రాశారన్నారు. ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని.. జూన్ 3న టెట్ పరీక్షలు నిర్వహించారన్నారు. ప్రభుత్వం తరపున అడిషనల్ అడ్వకేర్ జనరల్ రజనీకాంత్ రెడ్డి వాదనలు వినిపించారు. పదిమంది కోసం 2.45 లక్షల మంది నిరుద్యోగులను బలి చేయలేమని పేర్కొన్నారు. టెట్ పరీక్షకు డీఎస్సీకి దాదాపు నాలుగు నెలల సమయం ఉందన్నారు. పరీక్షల కోసం లక్షల మంది నిరుద్యోగులు ప్రిపేర్ అయ్యారన్నారు. పిటిషన్ వేసిన పదిమంది డిఎస్సీ ఎగ్జామ్కు అప్లై చేశారా? అనిహై కోర్ట్ ప్రశ్నించింది. గ్రూప్ 1 తో పాటు డిఏవో పాటు డీఎస్సీ కి అప్లై చేశారని పిటిషనర్ల తరుపు న్యాయవాది వెల్లడించారు. డీఎస్సీ హాల్ టికెట్లు సబ్మిట్ చేయకపోవడంపై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. పదిమంది పిటిషన్ వేసి ఒకరు కూడా డీఎస్సీ హాల్ టికెట్ ను ఎందుకు సబ్‌మిట్ చేయలేదని ప్రశ్నించింది. తదుపరి విచారణ ఆగస్టు 28కి హైకోర్టు వాయిదా వేసింది. అయితే డీఎస్సీ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం అయ్యాయి. ఆగస్ట్ 5కి ముగియనున్నాయి.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com